ANN తెలుగు

Follow: @ANNTELUGU

05-08-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 242 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM






సామాజిక సేవలో ముందుంటూ.. ఆదిలాబాద్ అభివృద్ధికై పరితపిస్తున్న మా అభిమాన నేత,
నిత్యాన్నదాత, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్

# శ్రీ కంది శ్రీనివాస రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు






































ANN తెలుగు

Follow: @ANNTELUGU

05-08-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 242 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బీసీ బిల్లు కోసం చలో ఢిల్లీ

### కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర నేతలు హస్తిన బాట

నేడు పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం

6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా.. 7న రాష్ట్రపతికి వినతిపత్రం

రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినా కేంద్రం మోకాలడ్డుతోంది: మీనాక్షి

వివరాలు 4లో

**టాప్ న్యూస్**

### భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తా..



- సంచలన ప్రకటన చేసిన డొనాల్డ్ ట్రంప్
- మరోసారి ఆక్రోశం వెళ్లగక్కిన అమెరికా ప్రెసిడెంట్

04

### మెగా కోడలు ఉపాసనకు కీలక బాధ్యతలు



- స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ కో ఛైర్మన్‌గా నియామకం
- సంతోషం వ్యక్తం చేసిన ఉపాసన

04

### బీసీలకే 42% రిజర్వేషన్లు అమలు చేస్తామంటే మద్దతిస్తాం



- మీకు చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వొద్దు
- ఢిల్లీలో ధర్నా పేరుతో కాంగ్రెస్ దొంగ నాటకాలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

04

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 99,930 |
| 22 క్యారెట్ | 91,600 |
| సిల్వర్ (కేజీ) | 1,16,000 |



### మహ్మద్ సిరాజ్ అద్భుతం

- ఐదో టెస్టులో టీమిండియా సంచలన విజయం
- 6 పరుగుల తేడాతో విక్టరీ.. ఐదు టెస్టుల సిరీస్ 2-2తో సమం
- కీలక వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన సిరాజ్

వివరాలు 4లో




# కాళేశ్వరంలో 70 వేల కోట్లు నీళ్ళ పాలు

### కాళేశ్వరం ఆర్థిక అవినీతితో నిండిన విఫల ప్రణాళిక

### 38 వేల కోట్ల ప్రాజెక్టు లక్షా 10వేల కోట్లకు తీసుకెళ్ళారు

నిపుణుల కమిటీ అవసరం లేదన్నా పట్టించుకోలేదు

దుమ్ముదులిపిన కాళేశ్వరం కమిషన్..ఆ మూడూ.. కేసీఆర్ ఏకైక నిర్ణయం

ప్రాజెక్టు తప్పిదాలకు కేసీఆరే బాధ్యుడు.. ఏజెన్సీలు, అధికారులు కలిసి కుట్ర పన్నారు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమే అవసరం లేదన్న నిపుణుల కమిటీ

లోపభూయిష్టమైన డిజైన్లు.. లోపభూయిష్టమైన నిర్మాణం..

మాన్యువల్స్ లేవు.. ఒప్పందాలు లేవు..

భారీగా నిధుల దుర్వినియోగం.. హరీష్, ఈటలకూ పాత్ర

కాళేశ్వరం కమిషన్ నివేదికలో సంచలనాలు..

స్మితా, జోషి, మురళీధర్ సహా పలువురి పాత్ర

04

**హైదరాబాద్ - మహా :** తాతల నాటి తాలిపేరు నిలబడ్డది.. మరి మేడిగడ్డ కు ఏమైంది ?? మొత్తం ప్రాజెక్ట్ లో వెన్నెముక మేడిగడ్డ. అంత పెద్ద పిల్లర్ లు నిట్ట నిలువుగా చీలిపోయాయి. వెన్ను పూస విరిగాక మిగతావి ఉంటుందా ? నదులకు నడక నేర్పడానికి.. 38వేల కోట్ల ప్రాజెక్టును 1.10లక్షల కోట్ల కు పెంచి, ప్రజాధనం అడ్డగోలుగా ఖర్చుచేసి.. కేసీఆర్ ఆధునిక భారతదేశ చరిత్రలో ఎవరూ సాహసించని భారీ తప్పిదానికి పాల్పడ్డాడని జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నీటిపారుదల రంగం నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాటన్ కట్టిన ధవళేశ్వరం కూడా ఇప్పటికీ చెక్కు చెదరలే.. కానీ వేలకోట్ల దుర్వినియోగం చేసి నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్ళకే ఫక్కున పగలడం, కుంగడం అవినీతి.. అక్రమం, ప్రజలపై, ప్రజాధనంపై నిర్లక్ష్యం కాక మరేంటి? గడిచిన డెబ్బై ఏళ్ల లో ప్రపంచ ప్రసిద్ధ నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల, యల్లంపల్లి, కడెం, సరళ సాగర్ ఇన్ని ప్రాజెక్ట్ లు నిలబడగా లేంది మేడిగడ్డ మాత్రమే ఎందుకు కూలింది? మన ముందు తరాల వాళ్ళు ప్రజల సంక్షేమం కోసం పనిచేశారు కానీ మీరు అంటూ సామాజిక మాధ్యమాలతో పాటు వివిధ వేదికలలో నివేదిక బయటికి వచ్చిన నాటి నుండీ కేసీఆర్ పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

### ఈటల తప్పుడు సమాచారం ఇచ్చారు!

- అప్పడు ఆర్థిక మంత్రిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- తేల్చి చెప్పిన పీసీ ఘోష్ కమిషన్

04

## స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 80,599.91 |
| నిఫ్టీ ↗ | 24,565.35 |

## ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

## ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.3 | 129 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.3 | 129 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.64 | 139.32 |

## పోరాట యోధుడు గురూజీ

### శిబు సోరెన్ మృతిపై ముఖ్యమంత్రి సంతాపం



హైదరాబాద్, మహా : జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనలోనూ, గిరిజన సమస్యల పరిష్కారం లోనూ మడమ తిప్పని పోరాటం చేసిన యోధుడు గురూజీ శిబు సోరెన్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరులోనూ శిబు సోరెన్ తనదైన ముద్ర వేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు శిబు సోరెన్ ఎప్పుడూ మద్దతు తెలిపేవారని... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైతం చివరి వరకు ఆయన మద్దతుదారుగా నిలిచిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.ఆదివాసీ సమాజానికి గురూజీ చేసిన సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని సీఎం తెలిపారు. ఎనిమిది సార్లు లోక్‌సభ ఎంపీగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా, జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించారని సీఎం తెలిపారు. శిబు సోరెన్ కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సానుభూతి తెలియజేశారు.

## తప్పు మొత్తం కేసీఆర్ దే..

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కూలిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం అధిక వడ్డీలతో రూ.84వేల కోట్లు అప్పు తెచ్చిందని తెలిపారు. రుణాలు తెచ్చే విషయంలో అప్పటి బీఆర్ఎస్ నాయకులు అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని గతంలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. రూ.38వేల కోట్లతో తుమ్మిడి హట్టి దగ్గర ప్రాజెక్ట్ చేపట్టాల్సి ఉందన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి స్థలాన్ని మార్చిందన్నారు. 16 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేలా డిజైన్ చేశారని పేర్కొన్నారు. కానీ కేసీఆర్ సీఎం అయ్యాక ఇష్టానుసారం డిజైన్లు మార్చేశారని మండిపడ్డారు. మేడిగడ్డ డిజైన్, నిర్మాణం అన్నీ కేసీఆరే చేశారని స్పష్టం చేశారు.

మిగతా 2లో

## కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్

### కొందరు నాయకుల అరెస్ట్ లు ఉండొచ్చు.. భయపడొద్దు

కాళేశ్వరం ప్రయోజనాలు ప్రజలకు వివరించాలి

ఫామ్ హౌజ్ లో ముఖ్యనేతలతో భేటీలో కేసీఆర్.. నేడు హరీష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్





**హైదరాబాద్, మహా :** అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అదే సమయంలో మెదక్ జిల్లా ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో

# కాళేశ్వరంలో 70 వేల కోట్లు నీళ్ళ పాలు

(హైదరాబాద్ - మహా )

తాతల నాటి తాలిపేరు నిలబడ్డది.. మరి మేడిగడ్డ కు ఏమైంది ?? మొత్తం ప్రాజెక్ట్ లో వెన్నెముక మేడిగడ్డ. అంత పెద్ద పిల్లర్ లు నిట్ట నిలువుగా చీలిపోయాయి. వెన్ను పూస విరిగాక మిగతావి ఉంటుందా ? నదులకు నడక నేర్పడానికి.. 38వేల కోట్ల ప్రాజెక్టు ను 1.10లక్షల కోట్లకు పెంచి, ప్రజాధనం అడ్డగోలుగా ఖర్చుచేసి.. కేసీఆర్ ఆధునిక భారతదేశ చరిత్రలో ఎవరూ సాహసించని భారీ తప్పిదానికి పాల్పడ్డాడని జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నీటిపారుదల రంగం నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాటన్ కట్టిన ధవళేశ్వరం కూడా ఇప్పటికీ చెక్కు చెదరలే.. కానీ వేలకోట్ల దుర్వినియోగం చేసి నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్ళకే ఫక్కున పగలడం, కుంగడం అవినీతి.. అక్రమం, ప్రజలపై, ప్రజాధనంపై నిర్లక్ష్యం కాక మరేంటి? గడిచిన డెబ్బై ఏళ్ల లో ప్రపంచ ప్రసిద్ధ నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల, యల్లంపల్లి, కడెం, సరళ సాగర్ ఇన్ని ప్రాజెక్ట్ లు నిలబడగా లేంది మేడిగడ్డ మాత్రమే ఎందుకు కూలింది? మన ముందు తరాల వాళ్ళు ప్రజల సంక్షేమం కోసం పనిచేశారు కానీ మీరు అంటూ సామాజిక మాధ్యమాలతో పాటు వివిధ వేదికలలో నివేదిక బయటికి వచ్చిన నాటి నుండీ కేసీఆర్ పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. 38వేల కోట్ల ప్రాజెక్టును అవసరం లేకున్నా ఊరుపేరు అంచనాలు మార్చి 1.10లక్షల కోట్లకు తీసుకెళ్ళారని కాళేశ్వరం కమిషన్ సంచలన విషయాలు వెల్లడించింది.

**ఇదీ నివేదిక పూర్తి సారం**

ఇది కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ తుది నివేదికకు సంబంధించిన పత్రం

**సారాంశం :**

జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ నేతృత్వంలోని విచారణ కమిషన్, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మెడిగడ్డ, అన్నారం, సుందిల్ల బేరేజీల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, ఆర్థిక వ్యవహారాలు, ఒప్పందాల అమలు, నిర్వహణ లో జరిగిన నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలపై దర్యాప్తు చేయడానికి నియమించబడింది.

**ఈ నివేదిక:**

- మోసం, లెక్కలు లేని ఖర్చులు, సరైన ప్రణాళిక లేకపోవడం, నిర్మాణ లోపాలు, నిర్వహణ లోపాలు ఉన్నాయని తీవ్రంగా పేర్కొంది.
- అప్పటి ముఖ్యమంత్రిపై ప్రధానంగా బాధ్యతను మోపింది.
- అనేక రాజకీయ, పరిపాలనా అధికారులు నియమావళులను పట్టించుకోకుండా ప్రజాధనాన్ని వృథా చేశారని పేర్కొంది.



**1. ప్రణాళికా లోపాలు:**

- ముఖ్యమంత్రి ఏకపక్ష నిర్ణయం: ప్రభుత్వం పూర్తిగా ఆమోదించని నిర్మాణ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ , నీటిపారుదల మంత్రి హరీష్ కలిసి తీసుకున్నారు.
- నిపుణుల నివేదికలు పక్కన పెట్టడం: జీవోఆర్టీ నెం. 28 ద్వారా ఏర్పాటు చేసిన కమిటీ మేడిగడ్డపై అభ్యంతరం తెలిపినా, ఆ నివేదికను పక్కన పెట్టారు.
- స్థల మార్పుపై తప్పుదారి పట్టే కారణం: "తుమ్మిడి హెట్టి వద్ద నీరు లేదు" అనే కారణం నిజం కాదు.
- కేబినెట్ ఆమోదం లేకుండా జీవోలు: మొదటి 3 జీవోలు (231233, తేదీ: 1.3.2016) కేబినెట్ ఆమోదం లేకుండా జారీ.
- ముఖ్యమంత్రి లేఖలో తప్పుగా ఖర్చు ప్రస్తావన: డిపిఆర్ పూర్తవకముందే రూ.71,436 కోట్ల ఖర్చు ప్రస్తావన.

**2. ఒప్పందాలు, నిర్మాణంలో లోపాలు:**

- తప్పుడు పద్ధతిలో ఒప్పందాలు: టర్న్‌కీ కాదు. సిడబ్ల్యుసి సిఫారసులను విస్మరించారు.
- అన్యాయముగా: ఖర్చులను అనవసరంగా పెంచుతూ, పనుల పరంగా మార్పులు చేసి, సంస్థలకు లాభాలు చేకూర్చారు.
- వ్యాప్కోస్ ను సంప్రదించకుండా ప్రాజెక్ట్ మార్పులు చేశారు. పర్సనల్ క్వార్టర్స్, గెస్ట్ హౌస్ వంటి అదనపు పనుల పేరుతో ఖర్చు పెంపు.

**3. నిర్వహణలో నిర్లక్ష్యం:**

- పూర్తిగా నిర్వహణ లేకపోవడం: మాన్సూన్ ముందుతరువాత తనిఖీలు, పరీక్షలు ఏమీలేవు.
- నీటిని నిలిపివేసి నష్టం కలిగించడం: స్టోరేజ్ కాకుండా డైవర్షన్ కోసం ఉన్న బారేజీలలో నీటిని నిలిపివేశారు.

**4. నాణ్యత నియంత్రణ లోపాలు:**

- **తప్పుడు డిజైన్:** నీరు ప్రవహించే నేలపై నిల్వ కోసం నిర్మాణం.
- **ప్రాథమిక అధ్యయనాలు జరగకపోవడం:** బ్యాక్‌వాటర్ స్టడీస్, జియోఫిజికల్ పరిశోధనలు మొదలైనవి జరగలేదు.

**5. కాంట్రాక్టర్లకు మేలు:**

- **తప్పుగా పూర్తి ధృవీకరణ పత్రాలు జారీ:** పూర్తి కాకపోయినా 'కంప్లీషన్ సర్టిఫికేట్'లు ఇచ్చారు.

**బాధ్యతలు:**

- **ముఖ్య బాధ్యత వహించినవారు:** కే. చంద్రశేఖర్ రావు: నేరుగా, పరోక్షంగా అన్ని అక్రమాలకు బాధ్యులు.
- **టీ. హరీష్ రావు:** నిపుణుల నివేదికలను పట్టించుకోలేదు.
- **ఈటల రాజేందర్:** ఆర్థిక నియంత్రణలో విఫలమయ్యారు.
- **ఎస్.కె. జోషి, స్మితా సబర్వాల్, మురళీధర్, హరిరామ్, వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, ఓంకార్ సింగ్ తదితర అధికారులు:** అనేక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు.

**ఇతర అధికారులు:**

- **బి. నాగేందర్ రావు:** నిర్వహణ విఫలమవడం, బాధ్యత ఇతరులపై మోపేందుకు ప్రయత్నించారు.
- **టి. ప్రమీల:** డ్యామ్ భద్రతలో నిర్లక్ష్యం.
- **అనిల్ కుమార్:** ఆదేశాలకు విరుద్ధంగా స్వచ్ఛందంగా పని చేశారు.
- **జె. శ్రీదేవి:** మోడల్ పరీక్షలు సరిగ్గా చేయలేదు.

**ఆర్థిక ప్రభావం:**

- **ప్రారంభ ఖర్చు:** రూ. 38,500 కోట్లు
- **సీఎం లేఖ ప్రకారం (2016):** రూ. 71,436 కోట్లు
- **మార్చి 2022 నాటికి:** రూ. 1,10,248.48 కోట్లు

**సిఫారసులు:**

- **ప్రభుత్వ నిధుల రికవరీ:** వ్యాప్కోస్ కు చెల్లించిన రూ. 677.67 లక్షలు తిరిగి వసూలు చేయాలి.
- **ఏజెన్సీలు అధికారులు కలిసి కుట్ర పన్నారు:** ప్రాజెక్టు పథకాన్ని దుర్వినియోగం చేసి తమకు లాభాలు తెచ్చుకునేలా కుట్ర పన్నారు.

**ఈ నివేదిక తేల్చిచెప్పిందేమిటంటే:**

- తెలంగాణ రాష్ట్రానికి జీవనాధారంగా భావించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక పెద్ద ఎత్తున పాలనా వైఫల్యం, సాంకేతిక నిర్లక్ష్యం, ఆర్థిక అవినీతితో నిండిన విఫల ప్రణాళికగా మిగిలిపోయిందని తేల్చింది.

## బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే మద్దతిస్తాం

### మీకు చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వొద్దు

ఢిల్లీలో ధర్నా పేరుతో కాంగ్రెస్ దొంగ నాటకాలు .. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, మహా:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు పూర్తిగా ఇస్తే బీజేపీ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ దేశ రాజధాని ఢిల్లీలో ధర్నా పేరుతో దొంగ నాటకాలు చేస్తుందని, తెలంగాణలో చేసిన డ్రామాలతో రాజకీయ మైలేజ్ రావడం లేదని మరో రకమైన కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. సోమవారం తన నివాసంలో మాట్లాడుతూ.. ఈప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కామారెడ్డి డిక్లరేషన్‌లో వాగ్దానం చేసిన విధంగా బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా మోసం చేస్తూ రాజకీయ లబ్ది పొందేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తుందని విరుచుక పడ్డారు. తెలంగాణలో స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేసి కేంద్రంపై నెట్టి గత ప్రభుత్వం చేసిన విధంగా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఎత్తులు వేస్తుందన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు ముస్లింలకు 10 శాతం ఇస్తామని చెప్పలేదని, అందుకే మద్దతు ఇచ్చామని, ముందు ఆమాట చెప్పి ఉంటే అప్పుడే బిల్లుకు దూరంగా ఉండేవారని తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని బీసీలు నమ్మే ప్రస్తకి ఉండదని వ్యాఖ్యానించారు.

## భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తా...

### సంచలన ప్రకటన చేసిన డొనాల్డ్ ట్రంప్

మరోసారి ఆక్రోశం వెళ్లగక్కిన అమెరికా ప్రెసిడెంట్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఇటీవల భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. తాజాగా మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును మళ్లీ విక్రయిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో చమురు విక్రయించి భారత్ లాభం గడిస్తోందంటూ ఆక్షేపించారు. భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేయడం వల్ల రష్యాకు భారీగా ఆర్థిక వనరులు చేకూరుతున్నాయని, అందుకే ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 'రష్యాతో యుద్ధం వల్ల ఉక్రెయిన్‌లో ఎంత మంది ప్రాణాలు కోల్పోతున్నారో వాళ్లకు అవసరం లేదు. అందుకే భారత్‌పై సుంకాలను మరింత పెంచబోతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు.

## తప్పు మొత్తం కేసీఆర్ దే..

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అప్పుడు సీఎం, నీటిపారుదల మంత్రి రెండు ఆయనే అని తెలిపారు. 2016లో కాళేశ్వరం అగ్రిమెంట్ జరిగిందని, 2019లో పనులు ప్రారంభమయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ చెప్పుకొచ్చారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ కుంగిపోయిందన్నారు.

**విచారణలో ఏం ఉంది..**

రాజకీయాల అంశాలతో సంబంధం లేకుండా పీసీ ఘోష్ కమిషన్ వేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. కమిషన్ 605 పేజీలతో కూడిన రిపోర్ట్‌ను ప్రభుత్వానికి ఇచ్చిందని చెప్పారు. రిపోర్ట్ అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ వేసినట్లు పేర్కొన్నారు. నివేదికను 25 పేజీలకు కుదించి కమిటీ క్లుప్తంగా అందించిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో అనేక లోపాలున్నాయని ఎన్డీఎస్ ఏ కూడా చెప్పిందని స్పష్టం చేశారు. డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని స్పష్టం చేసిందని అన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేబినెట్‌లో చర్చించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

## ఈటల తప్పుడు సమాచారం ఇచ్చారు!

### అప్పుడు ఆర్థిక మంత్రిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు.. తేల్చి చెప్పిన పీసీ ఘోష్ కమిషన్

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో కీలక విషయాలు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసి చిన్న నివేదికను కమిటీ కేబినెట్‌కు సమర్పించారు. 650 పేజీల జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ను అధ్యయనం చేసి 60 పేజీల సారాంశాన్ని తయారు చేసిన అధికారుల కమిటీ.. ఆ నివేదికను కేబినెట్‌కు సమర్పించింది. 60 పేజీల సంక్షిప్త నివేదికలో 32 సార్లు కేసీఆర్, 19 సార్లు హరీశ్ రావు, 5 సార్లు ఈటల పేరు ప్రస్తావన ఉన్నట్లుగా తెలుస్తోంది. బ్యారేజ్‌ల నిర్మాణానికి కేబినెట్ సబ్ కమిటీ సిఫారసు చేసిందని, కేబినెట్ అనుమతి ఉందని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ తప్పుడు సమాచారం ఇచ్చినట్లు కమిషన్ తన నివేదికలో ప్రస్తావించినట్లుగా తెలుస్తోంది. అప్పుడు ఆర్థిక మంత్రిగా ఉన్న ఈటల ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించారని తప్పు పట్టింది. కొందరు అధికారులు తప్పుడు సాక్ష్యాలు సమర్పించారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కమిషన్ సూచించింది.



## కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్

### కొందరు నాయకుల అరెస్ట్ లు ఉండొచ్చు.. భయపడొద్దు

కాళేశ్వరం ప్రయోజనాలు ప్రజలకు వివరించాలి

ఫామ్ హౌజ్ లో ముఖ్యనేతలతో భేటీలో కేసీఆర్.. నేడు హరీష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించినదేనని స్పష్టం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కేసీఆర్ తో సోమవారం కేటీఆర్ తో పాటు హరీష్‌రావు, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, జగదీష్ రెడ్డి తదితరులు భేటీ అయ్యారు. మరోవైపు మంత్రి ఉత్తమ్ కు కౌంటర్ గా హరీష్ మంగళవారం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు.

## మహ్మద్ సిరాజ్ అద్భుతం

### ఐదో టెస్టులో టీమిండియా సంచలన విజయం

6 పరుగుల తేడాతో విక్టరీ.. ఐదు టెస్ట్‌ల సిరీస్ 22తో సమం

కీలక వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన సిరాజ్

**స్పోర్ట్స్, మహా:** ఇంగ్లండ్ పర్యటనను టీమిండియా చిరస్మరణీయమైన విజయంతో ముగించింది. ఉత్కంఠకే ఊపిరి అందని రీతిలో సాగిన ఆఖరి టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన టీమిండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. 339/6 ఓవర్ నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. 85.1 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ సిరాజ్ (5/104) ఐదు వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో ఐదు టెస్ట్‌ల సిరీస్ 22తో సమంగా నిలిచింది. ఈ ఐదు టెస్ట్‌ల సిరీస్ చరిత్రలోనే ది బెస్ట్‌గా నిలిచింది.

**సిరాజ్ అద్భుతం..**

ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను జెమీ ఓవర్టన్ రెండు బౌండరీలతో దూకుడుగా ప్రారంభించాడు. కానీ సిరాజ్.. జెమీ స్మిత్ (2)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి భారత శిబిరంలో ఆశలు రేకెత్తించాడు. తన మరుసటి ఓవర్‌లో దూకుడుగా ఆడిన జెమీ ఓవర్టన్(9)ను సిరాజ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. జోష్ టంగ్ (0)ను స్టన్నింగ్ యార్కర్‌తో ప్రసిధ్ కృష్ణ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో మ్యాచ్ ఉత్కంఠగా మారగా.. జట్టు కోసం తీవ్ర గాయంతో క్రిస్ వోక్స్ బ్యాటింగ్‌కు దిగాడు. ఒంటి చేత్తోనే బ్యాటింగ్ చేసేందుకు సాహసం చేశాడు. వోక్స్ సాయంతో అట్కిన్సన్ జట్టు విజయం కోసం పోరాడాడు. సిరాజ్ బౌలింగ్‌లో అతను భారీ షాట్ కొట్టగా.. బౌండరీ



లైన్‌పై ఆకష్ దీప్ క్యాచ్ వదిలేసాడు. దాంతో అది సిక్సర్‌గా మారింది. ఆ తర్వాతి మూడు బంతులను డాట్ అవ్వగా.. ఆఖరి బంతికి బై రూపంలో సింగిల్ వచ్చింది. దాంతో మళ్లీ అట్కిన్సన్ స్ట్రైకింగ్‌లోకి వచ్చాడు.

**జో రూట్, హ్యారీ బ్రూక్‌ల జోరు..**

ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో అట్కిన్సన్ మూడు పరుగులు చేసి మళ్లీ స్ట్రైక్ తీసుకున్నాడు. కానీ సిరాజ్.. అట్కిన్సన్‌ను క్లీన్ బౌల్డ్ చేసి భారత విజయాన్ని లాంఛనం చేశాడు. బంతి బంతికి సమీకరణం మారిన ఈ మ్యాచ్‌లో విజయం టీమిండియానే వరించింది. మహమ్మద్ సిరాజ్ ఒంటి చేత్తో టీమిండియా ఓటమిని తప్పించాడు. సెంచరీలతో చెలరేగిన జో రూట్, హ్యారీ బ్రూక్‌లు ఔటవ్వడం ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 224 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 247 పరుగులకు ఆలౌటైంది. అనంతరం భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 పరుగుల భారీ స్కోర్ చేసి 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## మెగా కోడలు ఉపాసనకు కీలక బాధ్యతలు

### స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ కో ఛైర్మన్ గా నియామకం

సంతోషం వ్యక్తం చేసిన ఉపాసన

**హైదరాబాద్, మహా :** మెగా ఇంటి కోడలు, రాంచరణ్ సతీమణికి తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్ తనకు అప్పగించిన బాధ్యతల పట్ల ఉపాసన సంతోషం వ్యక్తం చేసారు. సీఎం కు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్ 'స్పోర్ట్స్ పాలసీ 2025'ను తీసుకొచ్చిన రేవంత్ ప్రభుత్వం తాజాగా 'స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ'ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థకు చైర్మన్‌గా సంజీవ్ గోయెంకాను నియమించింది. మెగా కోడలు ఉపాసన కామినేనిని కో చైర్మన్‌గా నియమించింది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా ఉపాసనకు బాధ్యతలు కేటాయిస్తూ అధికారికంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ బాధ్యతల కేటాయింపుపైన ఉపాసన స్పందించారు. స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణకు తనను కో చైర్మన్‌గా నియమించటంపై ఉపాసన సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఈ నియామకం తనకు ఎంతో గౌరవాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. తనకు సంజీవ్ గోయెంకాతో కలిసి పనిచేసే అవకాశం రావటం మరింత గౌరవంగా భావిస్తున్నట్లు ఉపాసన పేర్కొన్నారు. స్పోర్ట్స్ క్లబ్




ఆఫ్ తెలంగాణ బోర్డు సభ్యులుగా సన్ టీవీ నెట్‌వర్క్, సన్ రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్యా మారన్, ప్రముఖ క్రికెటర్ కపిల్ దేవ్, పుల్లెల గోపిచంద్, భూటియా, అభినవ్ బింద్రా, రవికాంత్ రెడ్డి తదితరులను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్న సంకల్పంతో క్రీడా విధానం తెచ్చామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలన్న ఉద్దేశంతోనే ప్రైవేటు పబ్లిక్ భాగస్వామ్యంతో క్రీడాపాలసీని రూపొందించామని తెలిపారు. క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నకార్పొరేట్ సంస్థలు, ఆ రంగంలో విశేష అనుభవం ఉన్న వారిని ఆహ్వానించే ఒక బోర్డును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మంచి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ఈ పాలసీ తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు.

## బీసీ బిల్లు కోసం చలో ఢిల్లీ

### కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర నేతలు హస్తిన బాట

నేడు పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం

6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా.. 7న రాష్ట్రపతికి వినతిపత్రం

రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినా కేంద్రం మోకాలడ్డుతోంది: మీనాక్షి

**హైదరాబాద్, మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ 'చలో ఢిల్లీ' కార్యక్రమం సిద్ధమైంది. రాష్ట్ర నేతలు చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి జెండా ఊపి రైలును ప్రారంభించారు. వీరితో పాటు కాంగ్రెస్ శ్రేణులంతా ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇందులో భాగంగా బిల్లుకు ఆమోదం తెలపాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 5, 6, 7 తేదీల్లో హస్తినలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చింది. 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నారు. ప్రతి జిల్లా నుంచి 25 మంది చొప్పున రైలులో వెళ్లారు. బీసీ రిజర్వేషన్ పెంపుపై చర్చ కోరుతూ నేడు పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వనున్నారు. ఈ నెల 7న ఆ పార్టీ నేతలు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినా కేంద్రం మోకాలడ్డుతోందని విమర్శించారు. రిజర్వేషన్లను సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు.

**రిజర్వేషన్లు సాధించాలన్న పట్టుదలతో..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకూ విశ్రమించరాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయం తీసుకున్నారు.



బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ముఖ్యమంత్రి చెప్పిన సంగతి తెలిసిందే. కాగా సెప్టెంబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఇక ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించగా, గవర్నర్ న్యాయ సలహా కోసం పంపించారు. బిసి రిజర్వేషన్ల బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్‌కు చట్టపరమైన చిక్కులు ఏమైనా ఎదురవుతాయా? అనే విషయంపై స్పష్టత ఇవ్వాల్సిందిగా ఆ ముసాయిదా ఆర్డినెన్స్‌ను గవర్నర్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపించారు. ఇలా బీసీల రిజర్వేషన్లపై జాప్యం జరుగుతున్నదని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు హస్తిన బాట పట్టారు. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల లోగా రిజర్వేషన్లు సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంది. ఒకవైపు కోర్టు ఆదేశం, మరో వైపు ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరకుండా ఎన్నికలకు వెళితే ప్రతిపక్షాలకు విమర్శించేందుకు ఆయుధాన్ని అందించినట్లు అవుతుందన్న ఆందోళన పార్టీ నేతల్లో కనిపిస్తున్నది.

Z కేటగిరీ

# ఎవర్నీ చీరి చింతకు కట్టాలి యువరానర్ !!



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

''ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరొక పార్టీలో చేరిన వాళ్ళను చీరి చింతకు కట్టాలి'' అని కేసీఆర్ దాదాపు పన్నెండు సంవత్సరాల కిందట పిలుపునిచ్చారు.అప్పట్లో ఆయన వ్యాఖ్యలు హై వోల్టేజ్ లో ఉండేవి.తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష కుంపటి నిరంతరం మండుతూ ఉండేలా కేసీఆర్ నిప్పు రాజేస్తూ ఉండేవారు.పార్టీ ఫిరాయింపుల గురించి చేసిన వ్యాఖ్యల్లోనూ అంతే 'ఫైర్' కనిపించింది.కానీ టిఆర్ఎస్ 'ఫక్తు రాజకీయ పార్టీ' గా మారిపోయాక 'చీరి చింతకు కట్టే' మాటల్ని ఉద్దేశపూర్వకంగానే మరచిపోయారు.పైగా తాను ఏమి చేసినా అది తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసమనో,లేదా తెలంగాణ పునర్నిర్మాణం కోసమనో ప్రతిపక్షాలు,మీడియా నోరు మూయించి,దబాయించి కేసీఆర్ సులభంగా సమర్థించుకునే వారు.ఆయన నిర్ణయాలను వ్యతిరేకించిన వారంతా 'తెలంగాణ ద్రోహుల' జాబితాలోకి చేర్చేవారు.కేసీఆర్ అడ్డూ,అదుపు లేకుండా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు.కాంగ్రెస్ పార్టీ నాయకుల పరిభాషలో 'ఫిరాయింపుల పిత' గానూ ఆయన విమర్శలు ఎదుర్కుంటున్నారు.పార్టీ ఫిరాయింపులపై రాష్ట్రంలో మరోసారి రాజకీయవేడి రాజుకుంది.ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య మాటలు తూటాలు పేలుతున్నాయి.ఫిరాయింపులకు కేసీఆరే ఆద్యుడని రేవంత్ విమర్శిస్తే ఆయారామ్ గయారామ్‌ల సంస్కృతికి అంకురార్పణ చేసిందే కాంగ్రెస్ అని కేటీఆర్ ఎదురుదాడి చేశారు.

**బిఆర్ఎస్ టికెట్టుపై గెలిచి కాంగ్రెస్ లోచేరిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవలసిందిగా అసెంబ్లీ స్పీకర్ ను సుప్రీంకోర్టు ఆదేశించింది.అక్టోబర్ చివరిలోగా స్పీకర్ ప్రసాద్ కుమార్ ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియదు. కానీ వారిపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ పార్టీ స్పీకర్ ను డిమాండ్ చేస్తోంది.10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రాబోతున్నట్టు కూడా కేటీఆర్ పదే,పదే చెబుతున్నారు.**

"అసలు తెలంగాణలో పార్టీ ఫిరాయింపులకు పునాదులు వేసింది ఎవరు?వివిధ పార్టీలకు చెందిన 61మంది ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలను బిఆర్ఎస్ లో చేర్చుకున్నారు.మా ప్రభుత్వం వచ్చి నెల తిరగక ముందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుంది.వందరోజులు కూడా ఈ ప్రభుత్వం పని చేయదు అని కేసీఆర్, కేటీఆర్,హరీశ్‌రావు అంటున్నారు.దానికి వంత పాడింది బీజేపీనే కదా. వాళ్లు అన్నమాటలను గాలికి వదిలేయాలా."అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2024 మొదట్లోనే చెప్పారు.బిఆర్ఎస్ నాయకుల ప్రకటనల నేపథ్యంలో 64 సీట్లతో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల ముంగిట ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపింది.భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి,బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలను కాంగ్రెస్ లో చేర్చుకున్నారు.బీఆర్ఎస్ విమర్శలపై సీఎం రేవంత్‌రెడ్డి అప్పట్లో తీవ్రస్థాయిలో మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామని మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? అంటూ ఎదురుదాడి చేశారు.

**"భారత దేశంలో అయారామ్ గయారామ్ సంస్కృతి మొగ్గ తొడిగింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే.ఇంధిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు హరియాణాలో ఏ ఎమ్మెల్యే గెలిచినా వారిని గుంజుకునే కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టింది. 2004లో మాతో పొత్తు పెట్టుకున్నారు.మా ఎమ్మెల్యేలు 26 మంది గెలిస్తే పది మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి చేర్చుకునే ప్రయత్నం చేశారు" అని గతంలో కేటీఆర్ అన్నారు.**

ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ కు పదేళ్లపాటు ప్రజలు పట్టం కట్టారు.ఉద్యమ కాలంలో దూకుడు,ఆ తర్వాత అధికారం దక్కడంతో అన్నీ అనుకున్నట్టు జరిగిపోయాయి. ''తెలంగాణను దున్నేశాం.. ఇక దేశాన్ని ఏలాల్సిన సమయం ఆసన్నమైంది'' అని కేసీఆర్ పార్టీ పేరును కూడా టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా మార్చేశారు.కానీ ఇప్పుడు పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.అయినా కేసీఆర్‌కు ఇంకా తత్త్వం బోధపడినట్లు లేదు.అధికారాన్ని కోల్పోయిన ఆరు మాసాల్లోపే పలువురు ముఖ్య నేతలు కారు దిగి ఇటు కాంగ్రెస్,అటు బీజేపీలో చేరిపోయారు.పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ ను నమ్ముకొని ఉన్నవారిలో న్యాయం జరిగింది అతికొద్ది మందికే. అది కూడా కేసీఆర్,కేటీఆర్ కొటరీలో ఉన్న వారికే తప్ప, గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా స్థాయి నేతలుగా ఎదిగిన వారెవరికీ కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు.2001 నుంచి 2014 వరకు ఉద్యమ పార్టీగా కార్యకర్తలు కూడా రాష్ట్ర సాధనలో భాగస్వాములై పదవులను ఆశించకుండా పార్టీ కోసం, ఉద్యమం కోసం పని చేస్తూ వచ్చారు.చాలా మంది తమ ఆస్తులను కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి.



పార్టీ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిపోయింది.అప్పటి వరకు తెరచాటున ఉన్న పెత్తందారులు, భూస్వాములు, అగ్రవర్ణాలకు చెందిన నేతలందరూ తెరపైకి వచ్చి జిల్లాల వారీగా చక్రం తిప్పడం మొదలుపెట్టారు.కేసీఆర్ బంధువులుగా చెప్పుకునే అనేక మంది కరీంనగర్, సిరిసిల్ల,సిద్దిపేట,జగిత్యాల తదితర జిల్లాల్లో ఆడింది ఆటా.. పాడింది పాటగా సాగించుకున్నారు.పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేసే వరకు జీవితాలను ధారపోసిన నేతలెవరూ కూడా అధిష్టానం దృష్టికే పోలేదు. అందుకే వారంతా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడించారు.రోజురోజుకు పార్టీ బలహీన పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నవి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల్లోనూ కనీసం ఒక్క సీటునైనా గెలవలేదు.దారుణమైన విషయం ఏమిటంటే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ ఎస్ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా ముందుకు రాలేదు.

**ఎన్నికల్లో ఒక రాజకీయ పార్టీ గుర్తుపై గెలిచిన అనంతరం పదవుల కోసం అధికారంలో ఉన్న పార్టీలోకి సదరు నాయకుడు జాయినవ్వడం రాజ్యాంగ వ్యవస్థలపై అపనమ్మకాన్ని కల్గిస్తోంది. పార్టీ ఫిరాయింపులు ప్రాంతీయ పార్టీలకే కాదు జాతీయ పార్టీలకు సైతం ఇబ్బందులు కలుగజేస్తున్నాయి.పార్టీ ఫిరాయింపులను నివారించడానికి మొదటిసారిగా 1985లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ చట్టాన్ని రూపొందించారు.52వ రాజ్యాంగ సవరణ ద్వారా 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' పేరుతో 10వ షెడ్యూల్‌లో చేర్చారు.2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూల్‌లోని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి కొన్ని మార్పులు చేశారు.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా బీఆర్ఎస్ లాగా భారీ ఫిరాయింపులకు పాల్పడలేదు. నిర్మల్ నుంచి బీఎస్పీ ఎమ్మెల్యేగా గెలిచిన ఇంద్రకరణ్ రెడ్డి, సిర్పూర్ కాగజ్‌నగర్ బీఎస్పీ ఎమ్మెల్యే కొనేరు కొనప్పను టీఆర్ఎస్‌లో చేర్చుకుని ఫిరాయింపులకు నాంది పలికారు.టీడీపీ తరఫున గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుని, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రి పదవి ఇచ్చి,టీడీపీ పార్టీని తెలంగాణలో లేకుండా చేశారు.2014 నుంచి 2018 వరకు నలుగురు ఎంపీలు, 25 ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలు మొత్తం 47 మందిని తన పార్టీలో చేర్చుకుని రాజకీయ పదవులను కట్టబెట్టారు.రెండోసారి సంపూర్ణ మెజార్టీతో 88మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచినా ప్రతిపక్ష హోదా కాంగ్రెస్ పార్టీకి ఉండకూడదన్న అహంకార ధోరణితో కాంగ్రెస్ నుంచి గెలిచిన వారిలో 12 మందిని రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడేలా ప్రోత్సహించారు. ఎమ్మెల్యేలనే కాదు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా సర్పంచ్, జడ్పీటీసీ,ఎంపీటీసీ,మున్సిపల్ కౌన్సిలర్లు,కార్పొరేటర్లు ఇలా అన్ని స్థాయిలోనూ నాయకులను టీఆర్ఎస్‌లో చేర్చుకుని రాజకీయ పరిహాసమాడారు..2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చినా మిగతా పార్టీల ఎమ్మెల్యేలను కూడా చేర్చుకొని అసెంబ్లీలో మొత్తం సంఖ్యా బలం 119 కాగా 104 మంది బిఆర్ఎస్ సభ్యులుగా సంఖ్యను కేసీఆర్ పెంచుకున్నారు.

**ప్రభుత్వంలో ఉండగా ఏనాడూ ఎమ్మెల్యేలను,మంత్రులను కలవని కేసీఆర్ ఓటమి అనంతరం ఫాంహౌస్‌కు పిలిపించుకుని మరీ ఎమ్మెల్యేలతో మంతనాలు చేశారు.పార్టీ ఫిరాయిం పులపై స్పీకర్‌కు వినతి పత్రాలు ఇవ్వటం,గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం, హైకోర్టులో కేసులు వేయడం చూస్తే రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ కుటిల రాజకీయాలు అర్థమవుతున్నాయి.సుప్రీంకోర్టులో కేసులు వేసి ఫిరాయింపులకు వ్యతిరేకంగా పోరాడడం జనానికి జనానికి ఆశ్చర్యం కలిగిస్తున్నది. పదేళ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అత్యంత కీలక నిర్ణయాలు, విధానాలపై చర్చ జరుగుతుండగా అసెంబ్లీకి హాజరవ్వకుండా సమావేశాలకే ముఖం చాటేయడం కేసీఆర్ గొప్పతనం.**

కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,తమిళనాడు,కర్ణాటక,గోవా,మణిపూర్,మధ్యప్రదేశ్,అరుణాచల్ ప్రదేశ్... ఇలా అనేక రాష్ట్రాలలో ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు అత్యంత సులభంగా పక్కపార్టీలలోకి మారిపోగలుగుతున్నారు. ప్రజాతీర్పుకు, పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని అనర్హులను చేయాలంటూ 38 ఏళ్ల కిందట తీసుకొచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టం ఏం చేస్తోందన్న చర్చ జరుగుతున్నది.సింగిల్ మెంబర్‌గానో, కొద్దిమందిగానో వెళితే ఫిరాయింపుల చట్టం ప్రకారం వేటు పడటం ఖాయం కాబట్టి,పార్టీ మారాలనే ఆలోచన ఉన్న ప్రజాప్రతినిధులంతా కలిసి, మూడింట రెండు వంతులకు సరిపడే సంఖ్యకు చేరుకున్నాక మరో పార్టీలోకి మారడమో, శాసనసభా పక్షంగా విలీనం కావడమో చేస్తున్నారు.ఇది ఒక ట్రెండ్‌గా మారింది.అది తెలంగాణ కావచ్చు, ఆంధ్రప్రదేశ్ కావచ్చు. కర్ణాటక, గోవా, మణిపూర్ కావచ్చు.ఇలా పార్టీ మారిన వారు నిరాటంకంగా తమ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవుల్లో కొనసాగుతున్నారు. కొందరు మంత్రులుగా మారుతున్నారు. ఫిరాయింపులను నిరోధించడానికి చట్టం ఉన్నా,అందులోని వెసులుబాటును వినియోగించుకుంటున్న నేతలు సులభంగా పార్టీలు మారిపోతున్నారు.విలీనం క్లాజ్‌ను తప్పుగా అన్వయిస్తున్నారని, ఒరిజినల్ పార్టీలో చీలిక లేకపోయినా, లెజిస్లేచర్ పార్టీ చీలికనే ఒరిజినల్ పార్టీ చీలికగా అన్వయిస్తున్నారని అది ఫిరాయింపుల చట్టానికి వక్రీకరణ అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు

ఇదే తరహాలో 2019లో గోవాలో కాంగ్రెస్,మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. స్పీకర్ ఈ ఫిరాయింపును చట్ట ప్రకారం సమర్థించాల్సి వచ్చింది.రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం వీరిపై అనర్హత వేటు వేయడం సాధ్యం కాలేదు.2014లో రెండు రాష్ట్రాలు విడిపోయి,సరిపడా ఎమ్మెల్యేలతో రెండు రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పడినా, అధికార పార్టీలు ఇతర పార్టీల నుంచి ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల నుంచి ఫిరాయింపులను ఆహ్వానించాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 66 మంది ఎమ్మెల్యేలలో 23 మందిని తమ పార్టీలో చేర్చుకున్నది.2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే, టీడీపీ ఎమ్మెల్యేలు కొందరు వైసీపీ పార్టీలో చేరకపోయినా, వైసీపీ ప్రభుత్వానికి మద్ధతుగా నిలబడిన సన్నివేశాలున్నవి. తెలంగాణలో 2014లో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 15 మంది సభ్యులున్న టీడీపీ శాసనసభా పక్షం మొత్తాన్ని విలీనం చేసుకుంది. మొదట ఇద్దరు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ వైపు వెళ్లగా ఆ తర్వాత 10మంది ఎమ్మెల్యేలు టీడీపీ శాసన సభా పక్షాన్ని టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేయాల్సిందిగా స్పీకర్‌ను కోరడం,ఆయన దాన్ని ఆమోదించడం చకచకా జరిపోయాయి.2014 అసెంబ్లీ ఎన్నికల్లో 15 సీట్లు గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ నుంచి చివరకు రేవంత్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, ఆర్.కృష్ణయ్య మాత్రమే అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేలుగా మిగిలారు.తెలంగాణలో 2018 ఎన్నికల తర్వాత ఎన్నికైన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు కూడా తమను పార్టీలో విలీనం చేసుకోవాల్సిందిగా టీఆర్ఎస్‌ను కోరగా ఆ విలీనం కూడా జరిగిపోయింది.అదే ఊపులో కాంగ్రెస్ పక్షం నుంచి 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరిపోయారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ ఎంపీలు పార్టీని చీల్చి బీజేపీలో విలీనం కావడం కూడా ఇటీవలి చరిత్రే. తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యులు వై.ఎస్.చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేశ్, గరికపాటి మోహన్ రావులు భారతీయ జనతా పార్టీలో చేరారు.ఆరుగురు సభ్యులున్న రాజ్యసభలో నలుగురు మెజారిటీ కాబట్టి తమని ప్రత్యేక వర్గంగా గుర్తించి భారతీయ జనతాపార్టీలో విలీనమయ్యేందుకు అంగీకరించాలని వారు రాజ్యసభ చైర్మన్‌కు లేఖ రాశారు.తర్వాత వారు బీజేపీలో చేరారు.

గతంలో పార్టీ ఫిరాయించడమంటే ఒకరిద్దరు ఎమ్మెల్యేలో,ఎంపీలో వేరే పార్టీలోకి మారిపోవడం లేదంటే,మద్ధతుపలకడం ఉండేది. పార్టీ ఫిరాయింపుల చట్టం వచ్చే వరకు అలాంటి వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉండేది కాదు.1960ల నాటికి ఈ ధోరణి బాగా పెరిగిపోయి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల అస్థిరత అనే సమస్య తీవ్రమైంది 1969నాటి చవాన్ కమిటీ నివేదిక, నాలుగో సార్వత్రిక ఎన్నికల తరువాత, మార్చి 1967, ఫిబ్రవరి 1968 మధ్య ఉన్న ఏడాదిలోపు కాలంలో అనేక రాష్ట్రాలలో శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో పార్టీని ధిక్కరించినట్లు పేర్కొంది.మొదటి సార్వత్రిక ఎన్నిల నాటి నుంచి నాలుగో సార్వత్రిక ఎన్నికల నాటికి సుమారు రెండు దశాబ్దాల కాలంలో 542 ఫిరాయింపు సంఘటనలు జరిగితే, కేవలం 1967 68 మధ్య కాలంలోనే కనీసం 438 ఫిరాయింపులు జరిగినట్లు చవాన్ కమిటీ గుర్తించింది.ఈ రెండు దశాబ్దాలలో 376 మంది ఇండిపెండెంట్ సభ్యుల్లో 157 మంది వేరే పార్టీలకు మారారు. పదవులను ఆశించి ఎక్కువమంది ఫిరాయింపులకు పాల్పడ్డారని కూడా ఈ కమిటీ పేర్కొంది. ఈ కాలంలో వివిధ రాష్ట్రాలలో ఫిరాయించిన 210 మంది శాసనసభ్యులలో 116 మందికి మంత్రి పదవులు దక్కాయి. 1967 నుంచి 1971 మధ్య 142మంది ఎంపీలు, 1900 మంది ఎమ్మెల్యేలు పార్టీలు మారారని రాజ్యసభ టీవీ కథనం పేర్కొంది.

1967 ఆగస్టు 11న అప్పటి లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ పెండేకంటి వెంకటసుబ్బయ్య తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ఈ తీర్మానం పార్లమెంటులో ఉండగానే, ఢిల్లీలో జరిగిన ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (సభాపతుల సదస్సు)లో కూడా ఇదే అంశంపై చర్చ జరిగింది.ఒక పార్టీ నుంచి ఎన్నికైన శాసన సభ్యులు మరొక పార్టీకి మారడం, దీని కారణంగా ప్రభుత్వాలు అస్థిరంగా మారే పరిస్థితి రావడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ఇది చూపించే ప్రభావం మీద ఈ సదస్సులో చర్చించారు.అనేక పరిణామాల తర్వాత 1985 జనవరిలో రాజ్యాంగ 52 వ సవరణ బిల్లుగా లోక్‌సభ ముందుకొచ్చింది.రాజీవ్ గాంధీ హయాంలో రాష్ట్రపతి ఆమోదం రావడంతో చట్టమయింది.రాజ్యాంగంలోని పదో షెడ్యూలు ద్వారా ఫిరాయింపుల నిరోధక చట్టం మార్చి 18 నుంచి అమలులోకి వచ్చింది.ఒక పార్టీ నుంచి ఎన్నికైన వ్యక్తి అదే పార్టీకి, దాని సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్నది. ఒక రకంగా రాజకీయంగా జవాబుదారీతనం ఉండాలన్నది ఈ చట్టం తీసుకురావడం వెనక ఉన్న ప్రధాన ఉద్దేశం.

పార్టీ ఫిరాయించిన వ్యక్తి తాను రాజీనామా చేసిన రోజు నుంచి ఏడాది వరకు,లేదంటే అతను రాజీనామా చేసి తిరిగి ఎన్నికయ్యే వరకు ఆ వ్యక్తి మంత్రి,స్పీకర్,డిప్యూటీ స్పీకర్ సహా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాల నుంచి, ప్రభుత్వ సంస్థల నుంచి జీతం తీసుకునే ఏ పదవినీ నిర్వహించకుండా అనర్హుడిగా ప్రకటించాలన్నదానితో సహా ఫిరాయింపుల నిరోధక చట్టంలో పలు నిబంధనలున్నాయి. ఒక పార్టీకి చెందిన సభ్యుడు తనంతట తానుగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నప్పుడు,పార్టీ అభీష్టానికి వ్యతిరేకంగా సభలో జరిగిన ఓటింగ్‌లో ఓటు వేసినప్పుడు,ఎన్నికల తర్వాత ఒక ఇండిపెండెండ్ సభ్యుడు వేరే పార్టీలో చేరినప్పుడు,ఒక నామినేటెడ్ సభ్యుడు, తాను నామినేట్ అయిన ఆరు నెలల తర్వాత ఏదైనా పార్టీలో చేరినప్పుడు అనర్హత వేటు వేయవచ్చు నని చట్టం చెబుతున్నది.

**ఒక పార్టీ మొత్తం మరొక పార్టీలో విలీనమైతే, లేదంటే కొత్త పార్టీగా ఆవిర్భవించినప్పుడు అందులో సభ్యులపై ఒకపార్టీ విడిపోయి ఒక వర్గం వేరొక పార్టీలో చేరుతున్నప్పుడు,అందులో చేరడానికి ఇష్టపడక, ప్రత్యేక వర్గంగా కొనసాగదలుచుకున్న సభ్యులపైఓటింగ్‌లో పాల్గొనడానికి 15 రోజుల ముందు పార్టీ అనుమతి తీసుకుని,ఆ ఓటింగ్‌కు దూరంగా ఉన్న సభ్యులపై అనర్హత ఫిర్యాదుపై నిర్ణయం తీసుకునే సర్వాధికారాలు స్పీకర్,చైర్మన్‌లకు ఈ చట్టం కట్టబెట్టింది.పదో షెడ్యులు ద్వారా చేర్చిన ఫిరాయింపుల చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ 2003లో ఎన్డీయే ప్రభుత్వం సవరణ బిల్లును ప్రవేశపెట్టింది.**

దీని ప్రకారం మూడింట ఒక వంతు సభ్యుల బలంతో ఒక పార్టీ నుంచి విడిపోయి వేరే వర్గంగా మారడానికి అవకాశమిచ్చే నిబంధనను తొలగించింది.అలాగే ఇంకొక పార్టీలో విలీనం కావడానికి కనీసం మూడింట రెండు వంతుల సభ్యులు సుముఖంగా ఉండాలన్న నిబంధనను చేర్చింది.ఫిరాయింపులను నిరోధించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన చట్టాలు కూడా నిరుపయోగంగా కనిపిస్తున్న దశలో ఈ వ్యవహారంలో సంస్కరణలు అవసరమన్న మాట వినిపిస్తోంది.అయితే, అటు రాజకీయ పార్టీలు, ఇటు సభాపతులు నైతిక నిబద్ధతలకు కట్టుబడి ఉండకపోవడం పెద్ద సమస్యగా మారిందని నిపుణులు అంటున్నారు.ఫిరాయించిన వారిని ప్రోత్సహించేలా పార్టీలు వ్యవహరించడం, అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం సర్వాధికారాలు ఉన్న సభాపతులు నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేయడం ఫిరాయింపుల నిరోధానికి ప్రధాన అడ్డంకిగా మారిందని అంటున్నారు.

స్పీకర్ దగ్గరకు అనర్హత ఫిర్యాదులు వచ్చినప్పుడు దానిపై వెంటనే చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి ఫిరాయింపులు కొనసాగే పరిస్థితి ఉంది.కొంతమంది స్పీకర్లు సభా కాలం ముగిసే వరకు నిర్ణయాలు తీసుకోని సందర్భాలున్నాయి.అలాంటప్పుడు చట్టం ఉన్నా లాభం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫిరాయింపులపై చర్యలకు కాలపరిమితి అంటూ లేకపోవడం,సంకీర్ణ రాజకీయాల కాలంలో సభాపతులు ఏదో ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరించే పరిస్థితులు సమస్యను పెంచుతున్నాయి.అలాగే స్పీకర్ నిర్ణయాన్ని సమీక్షించే అవకాశం లేదు.ఈ చట్టం పార్టీ ఫిరాయింపులను ఆపడానికి కాదని,అధినేతల మాటలకు గుడ్డిగా తల ఊపేలా చేసే అప్రజాస్వామిక చట్టమని లోక్ సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ విమర్శించారు. ఈ చట్టం ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందన్న భ్రమలు అవసరం లేదన్నారు.ఈ చట్టం అమలులో స్పీకర్లు కీలకపాత్ర పోషించాలని, వారు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం దని జే.పీ అన్నారు.స్పీకర్లు అధికారపక్ష మనుషులుగా ఉన్నంతకాలం ఈ చట్టం అమలు సవ్యంగా సాగదని ఆయన అభిప్రాయపడ్డారు.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

## ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, మహా:** ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వం లక్ష్యమని, పేద ప్రజలకు కార్పోరేట్ ఆసుపత్రుల తరహా వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి అన్నారు. కడ్తాల మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్ తండాకు చెందిన సభావట్ పిప్లీకి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ. 26 వేలు మంజూరయ్యాయి.ఈ మేరకు సోమవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేశ్ నాయక్, నాయకులు జైపాల్ రెడ్డి,బిక్కు నాయక్, రఘురాములు, మల్లారెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలి

- ఇందిరా పార్క్ ధర్నాను విజయవంతం చేయాలి
- సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందుకూరి జగన్



**ఆమనగల్లు, మహా :** 42 శాతం బీసీ రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలని,ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను పెద్ద ఎత్తున బిసి సామాజిక వర్గం హాజరై విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రంలో స్థానిక యం బి ఎ గార్డెన్ లో పార్టీ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశము శివగల రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పగడాల యాదయ్య కార్యదర్శి వర్గ సభ్యులు, కామ్రేడ్ కందుకూరి జగన్ హాజరై మాట్లాడుతూ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చినప్పటికీ కేంద్ర బిజెపి ప్రభుత్వము అట్టి బీసీ రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని తక్షణమే బీసీ రిజర్వేషన్లు ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసి సామాజిక వర్గాన్ని ఏకం చేసి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. బీహార్ రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ తో కుమ్మక్కై లక్షల ఓటర్లను తొలగించినటువంటి బీహార్ ఎన్నికల కమిషన్ కు వ్యతిరేకంగా ఈనెల 8న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని, తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాదులు హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరించే పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపైన సెప్టెంబర్ 1 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా సభలు సదస్సులు సంస్కృతిక కార్యక్రమాలు బైకు యాత్ర వంటి కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఘనతను ఇంటింటికి తెలిపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ అమనగల్లు ఏరియా కన్వీనర్ పిప్పల శివశంకర్,నాయకులు గుమ్మడి కురుమయ్య,జల్లెల పెంటయ్య,శివగల రమేష్,తొగరి పోచయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- సత్వర పరిష్కారానికి అధిక ప్రాధాన్యత
- సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ... హాస్టల్స్ , పాఠశాల విద్యార్థులకు అందించే ఆహారాన్ని తయారు చేసే చోటు, వంటగది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా కె.చంద్రారెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంగరకలాన్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్ అదనపు కలెక్టర్ కు స్వాగతం పలికారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా గతంలో పని చేసిన ఎం.వి.భూపాల్ రెడ్డి ఏసీబీ కేసులో అరెస్ట్ కావడంతో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ కి ఇన్ చార్జి బాధ్యతలు అప్పగించడం జరిగినది. ప్రస్తుతం ప్రతిమా సింగ్ మెటర్నిటీ సెలవులో వెళ్లడంతో ప్రభుత్వం హెచ్ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీగా పని చేస్తున్న కె.చంద్రా రెడ్డిని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ కె. చంద్రా రెడ్డి సోమవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

### హామీలను తక్షణమే నెరవేర్చాలి.. లేదంటే వెంటనే గద్దె దిగిపోవాలి
### హామీలు అమలు చేయకుండా కాలక్షేపం
### మాజీ ఎంపీ రాములు, ఓబిసి మెంబర్ తల్లోజు ఆచారి



**ఆమనగల్లు, మహా:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కడ్తాల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ర్యాలీ, ధర్నా నిర్వహించి తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.. ఈ ధర్నాలో మాజీ ఎంపీ రాములు, జాతీయ ఓబిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు చెప్పిన ఏ హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, లేదంటే ప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే గద్దె దిగిపోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని ప్రశ్నించారు. రూ.2వేల వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు చేస్తామన్నారని, వికలాంగుల పింఛన్ రూ.6వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మోసపూరిత మాయ మాటలతో అధికారం లోకి వచ్చి ఆరు గ్యారంటీల పథకాన్ని పూర్తిగా అమలు చేయకుండా కాలక్షేపం చేస్తోందని మండిపడ్డారు.ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి హరి ప్రసాద్,బిజెపి మండల శాఖ అధ్యక్షులు దోనాదుల మహేష్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మాన్యా నాయక్,రాష్ట్ర నాయకులు సాయిలాల్,భగీరథ్, శంకర్, జిల్లా నాయకులు శ్రీశైలం గౌడ్, యాదగిరి, మండల నాయకులు వెంకటేష్ యాదవ్, విక్రం, పొగాకు వెంకటేష్, రాములు, జంగం వెంకటేష్, మాజీ సర్పంచ్ సాయిలు, సాయిగౌడ్, నరేష్‌గౌడ్, ప్రేమ్ నాయక్, పవన్ రెడ్డి, సందీప్ నాయక్ బూత్ అధ్యక్షులు,పాల్గొన్నారు

## నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

- జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి
- డిట్ యాప్ ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- ప్రాథమిక సమాచారం యాప్ ద్వారా అందించాలి
- ప్రైవేట్ సెక్టారులో విద్యార్హతను బట్టి ఉద్యోగ కల్పన



**రంగారెడ్డి జిల్లా మహా:** రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్)ను ప్రారంభించిందని, యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ డీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ సంస్థలలో నిరుద్యోగ యువతకు నిరంతర ఉపాధి కల్పించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఆధారితమైన డీట్ వెబ్‌సైట్‌ను గత సంవత్సరం డిసెంబర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారని ఆయన అన్నారు. నిరుద్యోగులు ఈ వెబ్‌సైట్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని మరియు డీట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా, వారు విద్యా అర్హతలు, నైపుణ్యాలు వంటి ప్రాథమిక సమాచారంతో వారి ప్రొఫైల్‌లను పూర్తి చేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు.

దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు వారి నైపుణ్యాలు, విద్యా అర్హతలు, నివాస ప్రాంతం మొదలైన వాటి ఆధారంగా ఉద్యోగ సమాచారం అందించబడుతుందని, తయారీ, ఐటీ, ఫార్మా, వ్యవసాయ యజమానులు, ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసుకుని, అవసరమైన నైపుణ్యాలు, అనుభవం మరియు అర్హతలను తెలియజేస్తూ ఉద్యోగ సమాచారాన్ని అందిస్తారని కలెక్టర్ వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పనిచేసే ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ నిరుద్యోగులకు మరియు ఉద్యోగస్థులకు మధ్య ప్రధాన వారధిగా పనిచేస్తుందని, యువత కోరుకునే నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వివిధ నైపుణ్య శిక్షణ సంస్థలు అందించే కోర్సుల సమాచారాన్ని కూడా అందిస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, డిగ్రీలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన శిక్షణ, వాటిని పూర్తి చేసిన వారికి శిక్షణా కోర్సుల గురించి కూడా ఇది సమాచారాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. ప్రైవేట్ రంగంలో నిరంతర ఉపాధి లక్ష్యంగా ప్రారంభించిన ఈ డీఈఈటీలో వెంటనే నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్ఓ సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీపీఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయండి

### సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**రాజేంద్రనగర్, మహా :** భారత కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు, ఆగస్టు 20 నుండి 22 వరకు, మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ లో జరగనున్నాయిని, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కార్యాలయంలో సిపిఐ నాయకులతో కలిసి మహాసభల గోడపత్రికను సోమవారం విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల విజయవంతం చేయడానికి రాష్ట్ర నలుమూలల నుంచి సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున వస్తారని ఆయన అన్నారు. సిపిఐ పార్టీ రాష్ట్ర మహాసభల లో ప్రజా సమస్యలతో పాటు రాజకీయ సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై చర్చించి ప్రజలకు ఉపయోగకరంగా ఉండి విధి విధానాలను రూపొందిస్తామన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ తో మావోయిస్టులను తుదముట్టించడానికి కుట్ర చేస్తుంది. 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేని భారతదేశాన్ని చూస్తారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు చేయడం బాధాకరమన్నారు. కమ్యూనిజాన్ని తుడిచిపెట్టడం ఎవరి తరం కాదు, అది ఒక సైద్ధాంతిక సిద్ధాంతమన్నారు. కమ్యూనిజం ప్రజల కష్టాల్లో నుండి పుట్టింది, దాన్ని చంపడం అమిత్ షా వల్ల కాదు, బిజెపి ఆర్ఎస్ఎస్ వల్ల కాదన్నారు. రాష్ట్ర మహాసభలకు రంగారెడ్డి జిల్లా నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే రామస్వామి, యాదయ్య, జిల్లా సభ్యులు ప్రభు లింగం, బుద్ధుల జంగయ్య, పల్నాటి యాదయ్య, బాలరాజు, నరసింహ, కన్య నరసింహారెడ్డి, ఆర్ యాదగిరి, సత్యనారాయణ, రియాజ్, జిల్లా సభ్యులు నరగిరి, సక్రు నాయక్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

### స్పెషల్ ఆఫీసర్ హరి రతన్



**రాజేంద్రనగర్, మహా;** వందరోజుల ప్రణాళికలో భాగంగా, నార్సింగి పురపాలక సంఘం, కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, స్పెషల్ ఆఫీసర్ హరి రతన్ ఆధ్వర్యంలో సోమవారం ఎం,జి,ఐటి కాలేజీలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ హరి రతన్ మాట్లాడుతూ వనమహోత్సవంలో ప్రధానంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా జులై మొదటి వారంలో మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రకృతిని కాపాడుతూ జీవ వైవిద్యాన్ని సంరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలను నాటి ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడాలి అన్నారు. ప్రతి కాలనీలో సుమారు 2000 మొక్కలు నాటాలన్నారు. కాలేజీ విద్యార్థులు ఒక్కరు రెండు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్, డి ఈ ఈ నరేష్, ఏఈ శ్రీనివాస్, ఎన్ సిసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బాల్ రెడ్డి, ప్రొఫెసర్ చందర్ రావు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలేజీ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి రెండు మొక్కలు నాటాలి

### మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం: కమిషనర్ శరత్ చంద్ర



**రాజేంద్రనగర్, మహా :** వందరోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పండ్ల మొక్కలు ,ఉద్యానవన, పూల మొక్కలను పలు కాలనీవాసులకు అందజేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి కాలనీలో సుమారు 2000 మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్‌గౌడ్, లక్ష్మణ్, శివకుమార్, సాయి, శ్రీనుగౌడ్,కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ పై ఉక్కుపాదం

### షాద్ నగర్‌లో డ్రగ్స్ ఫ్రీ ఉద్యమానికి విశేష స్పందన




**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో. డ్రగ్స్ ఫ్రీ షాద్ నగర్. కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. విజయ కార్డియాక్ ఆసుపత్రి అధినేత డాక్టర్ చందూలాల్ రాథోడ్ సహకారంతో, ఈడెన్ ప్లాజాలో 1500 మంది విద్యార్థుల సాక్షిగా భారీగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "డ్రగ్స్ వ్యసనానికి రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు సైతం బానిసలయ్యారు. గతంలో డ్రగ్ మాఫియా పాలకుల ఆమోదంతో పెచ్చు మీద నీళ్లు పోయినట్టు పెరిగింది. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత ఈ మత్తు మాఫియా పై ఉక్కుపాదం మోపారు అని వ్యాఖ్యానించారు. విద్యార్థులు మత్తుకు బానిసలవకుండా, తమ కుటుంబ ఆశయాలను నిలబెట్టాలని ఆయన సూచించారు. విద్యార్థులు యాంటి డ్రగ్ వారియర్లుగా మారాలి. సమాజాన్ని రక్షించడానికి ముందుండాలి" అంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి యాంటి నార్కోటిక్ బ్యూరో అధికారి పి. సీతారాం, డీఎస్పీ సైదులు, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్ తదితరులు హాజరై, డ్రగ్స్ ను ఎదుర్కొనేందుకు ప్రతి యువకుడూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి "డ్రగ్ ఫ్రీ సమాజం – నా బాధ్యత" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యంగా ఫౌండేషన్ నిర్వాహకులను ఎమ్మెల్యే, పోలీసు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, న్యాయవాది సబియా సుల్తానా, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీకి రానున్న మంత్రి శ్రీధర్ బాబు

**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం లో రేషన్ కార్డులు భారీ సంఖ్యలో పంపిణీ చేయడం జరుగుతుందని ఇన్చార్జ్ కిచన్న గారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం నికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరుకాబోతున్నారని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులు,ఇందిరమ్మ కమిటీలు,కాంగ్రెస్ నాయకుల తో కలిసి మంత్రి శ్రీధర్ బాబు సన్న బియ్యం తో సంయుక్త భోజనం చేయనున్నట్లు కీచన్న గారి లక్ష్మారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

### ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ బహుకరణ: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలం కవేలిగూడ, గ్రామ చౌరస్తా నుండి వెంకటాపూర్ వరకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ జడ్పిటిసి నిరటి తన్విరాజ్ తో కలిసి, సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని, ఉప్పర్‌పల్లి ప్రైమరీ స్కూల్‌లో, క్లే పాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులతో కలిసి విద్యార్థులకు బ్యాగులు మెడల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులక మెడల్స్ బహుకరించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండి రఫీక్, బాబురావు, ప్రభుసాగర్, నరసింహ, గణేష్, రమేష్, రాజు, జంగయ్య, మేకల సత్తయ్య, ఎండి బరాన్, పెద్ద సత్తయ్య, గోవర్ధన్ రెడ్డి, జంగయ్య, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, ఏం నవీన్, పాఠశాల ఉపాధ్యాయులు, క్లే పాట్ ఫౌండేషన్స భ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష

**ఆమనగల్లు, మహా:** మైనర్ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెను శారీరకంగా వాడుకున్న కేసులో నిందితుడికి ఫోక్సో కేసు కింద 20 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ సోమవారం షాద్నగర్ ఫోక్సో కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.ఆమనగల్లు పట్టణానికి చెందిన ఏనుముల వెంకటేష్ పట్టణానికి చెందిన మైనర్ అమ్మాయితో పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెను శారీరకంగా వాడుకున్న కేసులో పోలీస్ స్టేషన్‌లో 2021లో కేసు నమోదయ్యింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి విచారించారు. నేరం రుజువు కావడంతో, కోర్టు ఫోక్సో చట్టం కింద నిందితుడికి 20 జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

## అన్ని కాలనీలకు మంచినీరు సరఫరా కావాలి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### మిషన్ భగీరథ, మున్సిపల్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలకు ఆయా ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు అందే విధంగా చొరవ చూపాలని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సునీత రెడ్డి సమక్షంలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి మున్సిపల్ సిబ్బంది మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల అనేక కాలనీలలో తను పర్యటించిన సందర్భంగా మహిళలు స్థానికులు పెద్ద ఎత్తున మిషన్ భగీరథ మంచినీటి సరఫరా పట్ల కొన్ని సమస్యలు తన దృష్టికి తెచ్చారని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. సమస్యలు చిన్నవిగా ఉన్నప్పుడే వాటిని గుర్తించి పరిష్కరిస్తే ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని ఆయన సూచించారు. ఆయా కాలనీలకు మంచినీటి సరఫరా అందించే విషయంలో అధికారులు ఎక్కడ అలసత్వం ప్రదర్శించకూడదని అన్నారు. అదేవిధంగా పట్టణంలోని పరిగి రోడ్డులో డివైడర్ ఏర్పాటు వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని అదే విధంగా విద్యుత్ కాంతులకు అనుగుణంగా ఆ ప్రాంతాన్ని ముస్తాబు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు విస్తరణ ప్రకారం నాలుగు కోట్ల రూపాయల నిధులతో ఈ రోడ్డును ముస్తాబు చేయాలని అధికారులను సూచించారు..

## భూ భారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, మహా:** భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై తహసీల్దార్లు దృష్టిసారించి వేగవంతంగా పరిష్కరించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్డిఓ ఎన్ ఆర్ సరిత, అదేవిధంగా నియోజకవర్గంలోని ఆయా మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" మాట్లాడుతూ.. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో షాద్ నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వెంటనే పరిష్కారం చేయాలన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్, పీవోపీ, డీ.ఎస్. పెండింగ్ అన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉన్నందున దరఖాస్తుల పరిష్కారానికి తగినచర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. వచ్చేవారం చేపట్టిన చర్యల పై తిరిగి సమీక్షించడం జరుగుతుందన్నారు. మీసేవా ద్వారా వచ్చే బర్త్, డెత్, ఆదా య, స్థానికం, యాఫ్‌లైన్ సర్టిఫికెట్స్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని తహసీల్దార్లకు ఎమ్మెల్యే శంకర్ సూచించారు..




# ఇంతే జీఎస్టీ ఎగ్గొట్టారా?

గడిచిన ఐదేళ్లలో (2024-25 ఆర్థిక సంవత్సరం వరకు) సుమారు రూ.7.08 లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ ఆఫీసర్లు గుర్తించారు. ఇందులో సుమారు రూ.1.79 లక్షల కోట్ల ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసం కూడా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా పార్లమెంటుకు తెలిపింది. లోక్‌సభలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక్క 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్టీ ఫీల్డ్ ఆఫీసర్లు గుర్తించారు. గత ఐదేళ్లలో గుర్తించిన మొత్తం 91,370 కేసుల్లో జీఎస్టీ ఎగవేత సుమారు రూ.7.08 లక్షల కోట్లుగా ఉంది. ఈ కాలంలో స్వచ్ఛంద డిపాజిట్ ద్వారా వసూలు చేసిన పన్నులు రూ.1.29 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి.

2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం మధ్య 44,938 కేసుల్లో సుమారు రూ.1.79 లక్షల కోట్ల ఐటీసీ మోసం జరిగింది. 2022, 2021 ఆర్థిక సంవత్సరాల్లో జీఎస్టీ ఎగవేతలు వరుసగా రూ.73,238 కోట్లు, రూ.49,384 కోట్లుగా ఉన్నాయి. ఇందులో ఐటీసీ మోసాలు వరుసగా రూ.28,022 కోట్లు, రూ.31,233 కోట్లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.30 లక్షల కోట్ల విలువైన జీఎస్టీ ఎగవేతను సీజీఎస్టీ ఫీల్డ్ ఆఫీసర్లు గుర్తించారు.

2023 ఆర్థిక సంవత్సరంలో రూ.1.32 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను గుర్తించామని, ఇందులో రూ.24,140 కోట్ల నకిలీ ఐటీసీ క్లెయిమ్‌లు ఉన్నాయని తెలిపారు. 2025 ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన 30,056 జీఎస్టీ ఎగవేత కేసులలో సగానికి పైగా లేదా 15,283 కేసులు ఐటీసీ మోసానికి సంబంధించినవి. వీటి ద్వారా రూ .58,772 కోట్ల ఎగవేత జరిగింది.

## 'ఏదో అలా బ్రతికేస్తున్నాం.. అంతే..'



బెంగళూరులో క్రమంగా క్షీణిస్తున్న జీవన నాణ్యత, నగరంలో పెరుగుతున్న రోజువారీ ఖర్చుల నేపథ్యంలో చాలామంది నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు పట్టణం వేగంగా విస్తరిస్తోంది. దాంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. స్థానికంగా నివాసం ఉండేందుకు రెంట్లు, జీవనవ్యయం అధికం అవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెలుస్తున్నాయి. తొమ్మిదేళ్లు నగరంలో నివాసం ఉన్న ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో చేసిన పోస్ట్‌కాస్తా వైరల్‌గా మారింది.
'నేను తొమ్మిదేళ్లుగా బెంగళూరులో నివసిస్తున్నాను. టెక్నాలజీ అభివృద్ధి, మెరుగైన పట్టణ వాతావరణం, జీవన నాణ్యత బాగుంటుందని ఇక్కడకు వచ్చాను. కానీ ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. 12 కిలోమీటర్లు ప్రయాణించడానికి నిత్యం మూడు గంటలు ట్రాఫిక్‌తో ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఎలాంటి పార్కింగ్ సదుపాయంలేని 1 బీహెచ్‌కే ఫ్లాట్‌కు రూ.30 వేల కంటే అధిక రెంటు ఉంది. క్యాబ్ బుక్ చేయడానికి ఏడు వేర్వేరు యాప్‌లను ఉపయోగిస్తున్నా చాలాసార్లు బుక్ అవ్వదు. నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. ఏదో అలా బ్రతుకుతున్నాం అంతే..' అని ఓ వ్యక్తి లింక్డ్ఇన్‌లో పోస్ట్ చేశాడు.
ఈ పోస్ట్‌పై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. 'నేను ఉద్యోగం కోసం ఇక్కడకు వచ్చాను. చాలా విషయాలతో ఇక్కడే చిక్కుకుపోయాను' అని ఒకరు రిప్లై ఇచ్చారు. 'ట్రాఫిక్ ఆత్మరక్షణలో ఉంది. కుటుంబంతో కంటే ప్రయాణాలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నాను' అని మరో వ్యక్తి తెలిపారు.

## తీవ్ర చిక్కుల్లో అనిల్ అంబానీ.. బ్యాంక్‌లకు ఈడీ నోటీసులు



రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీని కష్టాలు వెంటాడుతున్నాయి. మనీలాండరింగ్ కేసులో ఆయనపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. తాజాగా ఈ కేసులో పలు బ్యాంకులకు నోటీసులు జారీ చేసింది. లోన్ ఫ్రాడ్ కేసుకు సంబధించి పలు వివరాలు కోరింది. వీటిల్లో ఆయన కంపెనీలకు చెందిన రుణ మంజూరు పత్రాలు వంటివి ఉన్నాయి. మొత్తం 1213 బ్యాంకులకు దర్యాప్తు సంస్థ నుంచి నోటీసులు వెళ్లినట్లు తెలుస్తోంది. వీటిలో వీటిల్లో పబ్లిక్ సెక్టార్‌తోపాటు ప్రైవేటు సెక్టార్ బ్యాంకులు ఉన్నాయి. ఇవి రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ వంటి సంస్థలకు భారీగా అప్పులు ఇచ్చాయి. తాజాగా ఈడీ నోటీసులు అందుకొన్న జాబితాలో ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సింద్ బ్యాంక్ ఉన్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అనిల్ అంబానీ కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బకాయిలుగా మారిన కేసుల్లో కొందరు బ్యాంక్ అధికారులను కూడా ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది. వీరిని లోన్ క్లియరెన్స్‌లకు సంబంధించి అనుసరించిన ప్రాసెస్, రికవరీ చర్యలను అడగనున్నట్లు తెలుస్తోంది. కాగా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో ఇటీవల అనిల్ అంబానీకి నోటీసులు ఇవ్వగా తాజాగా మరో ఆరుగురికి కూడా నోటీసులు కూడా ఇచ్చింది. గత వారం రూ.3,000 కోట్ల మనీలాండరింగ్ కేసులో అనిల్ అంబానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న పార్థసారధి బిస్వాల్‌ను ఈడీ అరెస్టు చేసింది.



## హైదరాబాద్‌లో మెర్జెన్ కార్యకలాపాలు ప్రారంభం

కృత్రిమ మేధ, వర్క్ ఫ్లో ఆటోమేషన్ సామర్థ్యాల్లో వ్యూహాత్మక విస్తరణలో భాగంగా మెర్జెన్ కార్పొరేట్స్ తన అతిపెద్ద 'సర్వీస్ నౌ డిజిటల్ వర్క్ ఫ్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)'ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ సెంటర్ కోసం మొత్తంగా 1 మిలియన్ డాలర్లను (సుమారు రూ.8.3 కోట్లు) వెచ్చించనున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుతానికి కంపెనీలో 50+ సర్వీస్ నౌ నిపుణులు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2026 ప్రారంభం నాటికి ఈ సంఖ్య రెట్టింపు కానున్నట్లు కంపెనీ పేర్కొంది. కొత్తగా ప్రారంభించిన సెంటర్ 150 సీట్ల కెపాసిటీని కలిగి ఉన్నట్లు చెప్పింది. భవిష్యత్తులో దీని విస్తరణకు అనువుగా 8,000 చదరపు అడుగులు స్థలం ఉన్నట్లు స్పష్టం చేసింది. ఏఐ, లోకోడ్ ప్లాట్ ఫామ్‌లు, ఏఐఓపీలు, పరిశ్రమనిర్దిష్ట డిజిటల్ వర్క్‌ఫ్లోలను ఇందులో అభివృద్ధి చేస్తున్నట్లు కంపెనీ అధికారులు తెలిపారు. మెర్జెన్ ఫౌండర్ అండ్ సీఈఓ మహంత్ మల్లికార్జున మాట్లాడుతూ..'అభివృద్ధి చెందుతున్న క్లయింట్ అవసరాలను తీర్చడానికి పరిశ్రమ నిర్దిష్ట పరిష్కారాలను అందిస్తున్నాం' అన్నారు.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



## ఎయిర్ ఇండియా విమానంలో.. దురదృష్టవశాత్తూ బొద్దింకలు

**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియా విమానాలు ఏదో కారణంగా తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. తాజాగా శాన్ ఫ్రాన్సిస్కో నుండి కోల్‌కతా మీదుగా ముంబైకి నడిచే ఎయిర్ ఇండియా విమానం ఏI180లో చిన్న చిన్న బొద్దింకలు కనిపించాయని ఇద్దరు ప్రయాణికులు ఫిర్యాదు చేసిన దరిమిలా వాటిని తొలగించినట్లు ఎయిర్‌లైన్ తెలిపింది. ఎయిర్ ఇండియా విమానంలోని ఇద్దరు ప్రయాణికులు తమ సీట్ల వద్ద బొద్దింకలు ఉన్నాయని ఫిర్యాదు చేసిన అనంతరం వారి సీట్లు మార్చామని ఎయిర్ ఇండియా తెలిపింది. 'శాన్ ఫ్రాన్సిస్కో నుండి కోల్‌కతా మీదుగా ముంబైకి వెళ్లే ఏI180 విమానంలో, ఇద్దరు ప్రయాణికులు దురదృష్టవశాత్తూ చిన్న బొద్దింకల కారణంగా ఇబ్బంది పడ్డారు. దీంతో తమ క్యాబిన్ సిబ్బంది ఆ ఇద్దరు ప్రయాణికులను ఇతర సీట్లకు మార్చారు. అక్కడ వారు సౌకర్యవంతంగా కూర్చున్నారు. ఇంధన స్టాప్ సమయంలో, మా గ్రౌండ్ సిబ్బంది వెంటనే శుభ్రపరిచే ప్రక్రియను నిర్వహించారు' అని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. విమానంలో తమ పరిశుభ్రతా చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కీటకాలు కొన్నిసార్లు గ్రౌండ్ ఆపరేషన్ల సమయంలో విమానంలోకి ప్రవేశిస్తుంటాయి. ఇటువంటివి జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని ఎయిర్‌లైన్ తెలిపింది, ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నామని పేర్కొంది.





## జార్ఖండ్ మాజీ సీఎం శిబుసోరెన్ కన్నుమూత

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ ఎంపీ శిబు సోరెన్(81) ఇక లేరు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ ఉదయం కన్నుమూశారు. జార్ఖండ్ నుంచి శిబు సోరెన్ రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జార్ఖండ్ ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈయన తనయుడు.

జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో శిబు సోరెన్ కీలక పాత్ర వహించారు. ఆ ఉద్యమంలో భాగంగానే జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీని స్థాపించారు. అనంతరం జార్ఖండ్‌కు ఆయన మూడుసార్లు సీఎంగా పని చేశారు. దుమ్కా లోక్‌సభ నియోజక వర్గం నుంచి 8 సార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన.. యూపీఏ హయాంలో మూడుసార్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రెండుసార్లు రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు.

జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుకు కీలకంగా పని చేయడంతో పాటు వడ్డీ వ్యాపారుల ఆగడాలు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. చిరుదిహ్ హత్య కేసు శిబు సోరెన్ రాజకీయ జీవితంలో స్పీడ్ బ్రేకర్‌గా మారింది. 2004లో, శిబు సోరెన్ కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా ఉన్న టైంలో.. చిరుదిహ్ గ్రామంలో తన వ్యక్తిగత కార్యదర్శి శశినాథ్ ఝా హత్య కేసులో ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. ఈ కారణంగా ఆయన జూలై 24, 2004న కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఆయన ఒక నెల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉండి.. సెప్టెంబర్ 8న బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు.. చివరికి శిబు సోరెన్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. దీంతో ఆయన మరోసారి కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

## మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను సెటిల్ చేసుకోండి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** 150 ఏళ్లకు పైగా చరిత్ర కల్గిన పురాతన బాంకే బిహారీ ఆలయానికి సంబంధించి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంఆలయ ట్రస్టుల మధ్య నెలకొన్న వివాదాన్ని ఉన్నత స్థాయి కమిటి మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. బృందావన్‌లో ఉన్న బాంకే బిహారీ కృష్ణ దేవాలయం అంశానికి సంబంధించి ఈరోజు(సోమవారం, ఆగస్టు 4వ తేదీ) జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రధానంగా రూ. 500 కోట్లను ఆలయ నిధులతో దేవాలయ అభివృద్ధి పనులను చేపట్టడానికి యూపీ ప్రభుత్వం సిద్ధం కాగా, ఆలయ ట్రస్టు అభ్యంతరం వ్యక్తం చేయడంపై ఇది సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఆలయ నిధులను అభివృద్ధికి వాడటానికి మే 15వ తేదీన సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వగా, తాజా తీర్పులో ఆ వివాదాన్ని ఓ కమిటీ ఏర్పాటు చేసి దాని ద్వారా సెటిల్ చేసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. అదే సమయంలో గత తీర్పును ఉపసంహరించుకోవాలని ధర్మాసనం మౌఖికంగా ప్రతిపాదించింది ప్రస్తుత ధర్మాసనం.

**తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే..**

బాంకే బిహారీ ఆలయంయూపీ ప్రభుత్వం వివాదంపై జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది. 'బృందావన్‌లోని బాంకే బిహారీ టెంపుల్‌కు తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే. ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్ చేసుకోండి. సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని ప్రతిపాదిస్తున్నాం. ఆ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ట్రస్టు బోర్డుకు మధ్యవర్తిత్వం వహిస్తుంది. గత సుప్రీంకోర్టు తీర్పులో కొంత భాగాన్ని నిలుపుదల చేద్దాం. హైకోర్టు మాజీ న్యాయమూర్తి లేక సీనియర్ రిటైర్డ్ జిల్లా జడ్జి ఇరు పక్షాలకు ధర్మకర్తగా ఉంటారు' అని స్పష్టం చేసింది.





**ఇదీ ఆలయ చరిత్ర..**

1862లో నిర్మించబడిన ఈ ఆలయం రాజస్తానీ శైలిలో నిర్మించబడింది ఉత్తరప్రదేశ్‌లోని బాంకే బిహారీ ఆలయం బృందావన్‌లో ఉన్న శ్రీకృష్ణ భక్తులకు అత్యంత పవిత్రమైన స్థలాలలో ఒకటి. ఆధ్యాత్మికతతో నిండిన ప్రదేశం. ఇక్కడ శ్రీ బాంకే బిహారీగా పూజించబడే కృష్ణుడు, బాలరూపంలో దర్శనమిస్తాడు.

**ప్రత్యేకత:** ఈ ఆలయంలో గంటలు మోగించరు, హారతులు ఇవ్వరు ఇది భక్తి శ్రద్ధలకు అడ్డురాకుండా ఉండేందుకు అనాదిగా వస్తున్న ఆచారం. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే, అక్షయ తృతీయ రోజున మాత్రమే భక్తులు దేవుని పాదాలను దర్శించగలుగుతారు.

వివాదం ఇలా.. ఆలయ అభివృద్ధికి సంబంధించి యూపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం ఆలయ ట్రస్ట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తద్వారా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గత మే నెలలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరిస్తూ.. రూ. 500 కోట్లను కారిడార్ ప్రాజెక్ట్ కింద ఆలయ అభివృద్ధి కోసం వాడుకోవచ్చని స్పష్టం చేసింది. యూపీ ప్రభుత్వంతో బాంకే బిహారీ టెంపుల్ ట్రస్టు మధ్య వివాదం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదానికి కారణం రూ. 500 కోట్ల కారిడార్ ప్రాజెక్ట్. ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ ప్రణాళికను తీసుకురాగా, ఆలయ ట్రస్ట్ దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. గత తీర్పును మౌఖికంగా నిలుపుదల చేస్తూ దీనిపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదించింది. దీన్ని హైకోర్టు లేదా, జిల్లా కోర్టు మాజీ జడ్జిల ద్వారా ఓ కమిటీ ఏర్పాటు చేసి మధ్యవర్తిత్వంతో వివాదాన్ని పరిష్కరించడమే సరైన మార్గంగా పేర్కొంది.

**ఆలయ వారసత్వం దెబ్బతింటుందనే..**

యూపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆలయ అభివృద్ధినిధులు ఆర్డినెన్స్‌పై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఒకవైపు ఆలయ ట్రస్ట్ అభ్యంతరంతో పాటు స్థానిక ప్రజలు కూడా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో మరమ్మత్తులు చేపడితే ఆలయ వారసత్వం, వాస్తవికత దెబ్బతింటుందని అభిప్రాయం వ్యక్తమైంది. ఇది సున్నితమైన అంశం కావడంతో పాటు ఆధ్యాత్మిక వైభవం, సంప్రదాయాల సమతుల్యతలపై అనేక ప్రశ్నలు లేవనెత్తింది.

## నిజమైన భారతీయులు ఇలా చేయరు

### రాహుల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించిది. భారత సైన్యం గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. 2 వేల కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని మీరు (రాహుల్)ఎలా చెబుతున్నారని కోర్టు ప్రశ్నించింది. భారత్ జోడోయాత్రలో రాహుల్ గాంధీ ఆర్మీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని ఉదయ్ శంకర్ అనే వ్యక్తి పరువు నష్టం దావా కింద క్రిమినల్ కేసు వేశారు. అయితే ఈ ఫిర్యాదులో విచారణపై స్టే విధించాలంటూ రాహుల్ గాంధీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏసీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ మేరకు రాహుల్ వ్యాఖ్యలను అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని ప్రశ్నించింది. ప్రతిపక్షనేత హోదా కలిగిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని హెచ్చరించింది. నిజమైన భారతీయులు ఇలాంటి వ్యాఖ్యలు చేయరని మండిపడింది. కాగా గతంలో భారత్ జోడో యాత్ర సందర్భంగా..2,000 కిలోమీటర్లకు పైగా భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 2020 జూన్‌లో లద్దఖ్‌లోని గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన హింసాత్మక ఘర్షణ అనంతరం, మోదీ ప్రభుత్వం చైనాకు లొంగిపోయిందని, 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని డ్రాగన్ దేశం చట్టవిరుద్ధంగా ఆక్రమించిందని ఆరోపించారు.



## మా కోడలికి పెద్ద బాధ్యత..
# చాలా ఆనందంగా ఉంది

కోడలికి తెలంగాణ స్పోర్ట్స్ హబ్ కోసం బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ కో ఛైర్మన్‌గా అవకాశం దక్కడంపై మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. క్రీడల అభివృద్ధికి ఉపాసన నియామకం పట్ల చాలా ఆనందంగా ఉందన్నారు. ఇది గొప్ప బాధ్యతతో పాటు మా కోడలికి దక్కిన గౌరవమని ట్వీట్ చేశారు. ఉపాసన నిబద్ధత, అభిరుచి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధానాలను రూపొందించడానికి ఉపాసన తప్పకుండా కృషి చేస్తుందని.. నీకు ఆ దేవుడి ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఉంటాయని చిరంజీవి పోస్ట్ చేశారు. కాగా.. మెగా హీరో రామ్ చరణ్ భార్య ఉపాసనకు తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ హబ్ కోసం బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్‌ని నియమించింది. ఇందులో ఉపాసనకు చోటు దక్కింది. ఇందులో భాగంగా పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విషయంపై క్రీడారంగాల్ని ప్రోత్సాహిస్తున్న కార్పొరేట్ సంస్థలు, ఆ రంగంలో విశేష అనుభవం ఉన్నవాళ్లతో ఓ బోర్డ్ ఏర్పాటు చేసింది. ఈ బోర్డ్‌లో ఐపీఎల్‌లో లక్నో జట్టుకు యజమానిగా వ్యవహరిస్తున్న సంజీవ్ గోయెంకాని ఛైర్మన్‌గా నియమించారు. కో ఛైర్మన్‌గా ఉపాసనకు బాధ్యతలు అప్పగించారు. బోర్డ్ సభ్యులుగా సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు యజమాని కావ్య మారన్, దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, ఒలింపిక్ విజేత అభినవ్ బింద్రా, భూటియా, రవికాంత్ రెడ్డిని నియమించారు.

## ఖుషి టోటల్ కలెక్షన్స్ దాటేసిన కింగ్డమ్..
# ఎంతొచ్చాయంటే?



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ కింగ్డమ్ మూవీకి కొంత మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ వసూళ్లు మాత్రం బాగానే ఉన్నాయి. జూలై 31న విడుదలైన ఈ సినిమా మౌత్‌టాక్‌తోనే దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఈ చిత్రానికి రూ.82 కోట్లు వచ్చాయి. కేవలం నాలుగు రోజుల్లోనే ఈ రికార్డు సాధ్యమైంది. నిన్న ఆదివారం కావడంతో వసూళ్లు ఏమాత్రం తగ్గలేదు.

### ఖుషిని దాటేసిన కింగ్డమ్

విజయ్ హీరోగా నటించిన ఖుషి సినిమా టోటల్ రన్‌లో దాదాపు రూ.75 కోట్లు వసూలు చేసింది. కింగ్డమ్ ఆ రికార్డును దాటేసింది. ఏకంగా వంద కోట్ల క్లబ్ దిశగా పరుగులు పెడుతోంది. కింగ్డమ్ సినిమా విషయానికి వస్తే.. సత్యదేవ్, విజయ్ దేవరకొండ అన్నదమ్ములుగా నటించారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. మలయాళ నటుడు వెంకటేశ్ కీలక పాత్రలో నటించాడు. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ మూవీని నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. అనిరుద్ రవిచందర్ సంగీతమందించాడు.

## అమెరికాలో పుష్ప క్రేజ్..
# అల్లు అర్జున్ ఫిదా!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప మూవీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. పుష్ప మేనరిజానికి టాలీవుడ్ ఫ్యాన్స్ మాత్రమే కాదు.. డేవిడ్ వార్నర్ లాంటి ఓవర్‌సీస్ అభిమానులు కూడా ఉన్నారు. తాజాగా పుష్ప సినిమాను సాంగ్‌ను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించారు. అమెరికా గాట్ టాలెంట్ డ్యాన్స్ షోలో ఇండియాకు చెందిన బీ యూనిక్ క్రూ పుష్ప సాంగ్‌కు ఒళ్లు గగుర్పొడ్చేలా ప్రదర్శన ఇచ్చారు. ఇది చూసిన ఆడియన్స్ చూస్తున్నంతసేపు ఆందోళనతో పాటు భయానికి గురయ్యారు. బీ యూనిక్ క్రూ టీమ్ చేసిన సర్‌ప్రైజ్ ప్రదర్శనకు అక్కడ న్యాయ నిర్ణేతలు సైతం షాకయ్యారు. ఈ వీడియోను పుష్ప టీమ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ వీడియో చూసి అల్లు అర్జున్ సైతం ఫిదా అయ్యారు. వావ్.. మైండ్ బ్లోయింగ్ అంటూ ట్వీట్ చేశారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరలవుతోంది. ఇంకెందుకు ఆలస్యం ఈ అద్భుతమైన ప్రదర్శనను మీరు కూడా చూసేయండి.

## పదేళ్లలో ఆదాయం
# వందల కోట్లు

ప్రస్తుతం హిందీ సినిమా పరిశ్రమలో అత్యంత సుపరిచితమైన విమర్శకుల ప్రశంసలు పొందిన పేర్లలో ఒకరిగా కృతిసనన్ ఎదిగింది. అయితే, ఆమె స్టార్‌డమ్‌కు మార్గం ఇంజనీరింగ్ క్లాస్‌రూమ్‌ల నుంచే మొదలైంది.

### ఇంజనీరింగ్ టూ సిల్వర్‌స్క్రీన్..

సంప్రదాయ. ఇంజనీరింగ్ నేపథ్యం నుంచి వచ్చిన కృతి బాలీవుడ్ తో ఎటువంటి కుటుంబ సంబంధాలు లేకుండా, వినోద ప్రపంచంలోకి పూర్తిగా బయటి వ్యక్తిగా ప్రవేశించింది. ఆమె మొదట్లో మోడలింగ్ ద్వారా వెలుగులోకి వచ్చింది, క్రమంగా తన విలక్షణమైన శైలి ఆత్మవిశ్వాసంతో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకుంది. 2014లో ప్రముఖ నటుడు జాకీ ష్రాఫ్ కుమారుడు టైగర్ ష్రాఫ్‌తో కలిసి యాక్షన్ రొమాన్స్ చిత్రం హీరోపంతిలో నటించడంతో ఆమెకు పెద్ద బ్రేక్ వచ్చింది. ఆ అరంగేట్రం విజయవంతమైన ప్రయాణానికి నాంది పలికింది. శరవేగంగా ఆకట్టుకునే అందాల తారగా మారి భారతీయ సినిమాలోని అత్యంత ప్రసిద్ధ వ్యక్తులతో కలిసి పనిచేసే అవకాశాన్ని సంపాదించింది. ఆదిపురుష్‌లో ప్రభాస్ సరసన సీత పాత్రలోనూ నటించింది. 2015లో, రోహిత్ శెట్టి బ్లాక్ బస్టర్ దిల్‌వాలేలో షారుఖ్ ఖాన్, కాజోల్ లతో కలిసి స్క్రీన్ స్పేస్ పంచుకుంది. తరువాతి కొన్ని సంవత్సరాలలో కృతి బరేలీ కి బార్, లుకా చుప్పీ, హౌస్ ఫుల్ 4 తదితర చిత్రాల ద్వారా స్థిరమైన విజయాలను దక్కించుకుంటూ వచ్చింది. మిమి (2021)లో పోషించిన సర్రోగేట్ తల్లి పాత్ర ఆమెకు ప్రతిష్ఠాత్మక జాతీయ చలనచిత్ర అవార్డును కూడా అందించింది. అందంతో పాటు అభినయ ప్రతిభ ఉన్న నటిగా బాలీవుడ్‌లో ఆమె స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది.

### బిజినెస్‌లో బిజీ బిజీగా...

అనంతరం కృతి అభిరుచులు కెమెరాకు మించి విస్తరించాయి. మోడలింగ్ సినిమా సెట్లలో గ్లామర్ సౌందర్య పోషణతో సంవత్సరాల తరబడి పరిచయం ఉండడంతో కృతి సులభంగా స్కిన్ కేర్ స్పేస్ లోకి ప్రవేశించింది. కోవిడ్, లాక్‌డౌన్ సమయంలో, ఆమె చర్మ సంరక్షణ దినచర్యలు, ఉత్పత్తులను లోతుగా అర్థం చేసుకోవడంలో మునిగిపోయింది. ఈ అభిరుచి 2023లో తన సొంత బ్యూటీ బ్రాండ్ హైఫర్ ను ప్రారంభించడానికి దారితీసింది. హైఫన్ ఇప్పుడు టాప్ సెలబ్రిటీ బ్యూటీ లేబుల్‌లలో ఒకటిగా నిలిచింది, ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, ఈ చర్మ సంరక్షణ లేబుల్ దాని మొదటి సంవత్సరంలోనే రూ. 100 కోట్ల అద్భుతమైన ఆదాయాన్ని ఆర్జించింది, అత్యంత పోటీతత్వ మార్కెట్‌లో తనను తాను స్థిరపరచుకుంది. కత్రినా కైఫ్ కే బ్యూటీ, మీరా రాజ్‌పుత్ అక్రైండ్, ఆష్కా గోరాడియా రెనీ కాస్మెటిక్స్ వంటి వాటితో పోటీ పడుతోంది. కృతికి చర్మ సంరక్షణ పట్ల ఉన్న నిజమైన మక్కువ, ఆమె స్వయంగా అన్నింటినీ పర్యవేక్షించడం ఈ బ్రాండ్ శీఘ్ర విజయానికి మూలస్తంభంగా మారింది.

## ఫిట్.. హిట్...

స్కిన్ కేర్ ఉత్పత్తుల కంటే ముందే . 2022లో, ఆమె ఫిట్‌నెస్ బ్రాండ్ అయిన ది ట్రైబ్‌ను సహ యజమానురాలిగాస్థాపించింది. దీనికి ఆమె మిమి షూటింగ్ కోసం కృతి తన పాత్రను పండించడం కోసం దాదాపు 15 కిలోగ్రాముల బరువు పెరిగింది. లాక్‌డౌన్ కారణంగా జిమ్‌లు మూసేయడంతో అదనపు బరువు తగ్గడం ఆమెకు బాగా కష్టమైంది. దాంతో వర్చువల్ సెషల్ ద్వారా నలుగురు వ్యక్తిగత శిక్షకుల మార్గదర్శకత్వంలో తాను ఇంట్లోనే వ్యాయామం చేశానని కృతి వెల్లడించింది. ఈ లోతైన వ్యక్తిగత సవాలుతో కూడిన దశ ఆమెను ఆ శిక్షకులతో కలిసి ది ట్రైబ్ ఏర్పాటుకు ప్రేరేపించింది. అదే సంవత్సరంలో, ఆమె ముంబైలోని ఉన్నత స్థాయి జుహు ప్రాంతంలో తన మొదటి ఫిట్‌నెస్ స్టూడియోను ప్రారంభించింది. రెండు సంవత్సరాల తరువాత, 2024లో, ముంబైలోని మరొక ఉన్నత పరిసర ప్రాంతమైన బాంద్రాలో రెండవ స్టూడియో తెరిచింది.



## వాళ్లతో ఒక్కసారి కనిపిస్తే
# పెళ్లి చేసేశారు: తమన్నా

మిల్కీ బ్యూటీ ప్రేక్షకుల గుండెల్లో చోటు సంపాదించుకున్న హీరోయిన్ తమన్నా. తెలుగులో దాదాపు స్టార్ హీరోల అందరి సరసన నటించింది. టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణించిన ముద్దుగుమ్మ.. ప్రస్తుతం పెద్దగా కనిపించట్లేదు. ఈ ఏడాదిలో ఓదెల2 మూవీతో అభిమానులను పలకరించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అంతగా రాణించలేకపోయింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న తమన్నా తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైంది. ఈ సందర్భంగా తనపై వచ్చిన రూమర్స్‌పై క్లారిటీ ఇచ్చింది. గతంలో పాక్ క్రికెటర్ అబ్దుల్ రజాక్‌తో తమన్నా పెళ్లి అంటూ వచ్చిన కథనాలపై స్పందించింది. ఇలాంటి వార్తలు చాలా ఫన్నీగా అనిపించాయని గుర్తు చేసుకుంది. ఓ ఆభరణాల దుకాణం ప్రారంభోత్సవంలో అబ్దుల్ రజాక్‌తో కలిసి ఫోటో దిగడంతో ఇలాంటి రూమర్స్ వచ్చాయని తెలిపింది. తనకు కేవలం అబ్దుల్ రజాక్‌తో మాత్రమే కాదు.. విరాట్ కోహ్లీతోనూ తనకు ముడిపెట్టారని వివరించింది. నా జీవితంలో విరాట్‌ను కేవలం ఒక్కసారి మాత్రమే కలిశానని తమన్నా వెల్లడించింది. ఇలాంటి కథనాలు వచ్చినప్పుడు చాలా ఇబ్బందికరంగా, బాధగా అనిపిస్తుందని పేర్కొంది. ఇలాంటి వాటిని మరిచిపోవడానికి కాస్తా సమయం పడుతుందని తెలిపింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com